ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 23 నవంబరు 2024

విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న కలెక్టర్ శ్రీధర్



మెనూ ప్రకారం
నాణ్యమైన భోజనం అందించాలి
● కలెక్టర్ చామకూరి శ్రీధర్

సుండుపల్లె, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వయంగా విద్యార్థులకు భోజనం వడ్డించారు. అలాగే మెయిన్ అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలతో మాట్లాడారు. ప్రభుత్వం అందించేవి సక్రమంగా అందించాలన్నారు. చిన్నారుల క్రమశిక్షణను చూసి అంగన్వాడీ కార్యకర్త రజనీని అభినందించారు. చిన్నతనం నుంచి ఆటపాటలతో కూడిన విద్యను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దైవాదీనం, డిప్యూటీ తహసీల్దార్ రెడ్డెన్న, మండల విద్యాశాఖ అధికారులు వెంకటేశ్‌నాయక్, రవీంద్రనాయక్, సూపర్‌వైజర్లు వనజమ్మ, వెంకటలక్ష్మి, సుశీల, విజయలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్త రజిని తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లి: అధికారుల వద్దకు వచ్చే ప్రతి దరఖాస్తును నిష్పక్షపాతంగా పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించి ఆయా శాఖల్లో తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా విద్యార్థుల అపార్ ఐడీ కోసం నోటీ కోరవద్దని, హౌస్‌హోల్డ్ ట్యాగింగ్ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణంలో దశల వారి ప్రగతి సాధించాలని, లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం చూపరాదని తెలిపారు. అనంతరం పల్లెపండుగ కార్యక్రమంలో మట్లితో చేపట్టిన బీటీ రోడ్డును పరిశీలించారు. నాణ్యతలో రాజీ పడకుండా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రావణి, ఎంపీడీవో నూర్జహాన్, ఎంఈవో కృష్ణయ్య, హౌసింగ్ అధికారులు, వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి
● సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

పెద్దమండ్యం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అధికారులను ఆదేశించారు. మండలంలోని పెద్దమండ్యం, సిద్దవరం, శివపురం, రెడ్డివారిపల్లి గ్రామాల్లో శుక్రవారం సబ్ కలెక్టర్ పర్యటించారు. గత ప్రభుత్వ హయాంలో రీసర్వే పూర్తి చేసుకున్న సిద్దవరం, శివపురం గ్రామాల్లో జరుగుతున్న భూముల సరిహద్దు రాళ్లపై జగన్ బొమ్మల తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. సిద్దవరం గ్రామ పంచాయతీలో వ్యవసాయ భూముల రైతులకు 577 ఖాతాలు ఉండగా, శివపురం గ్రామ పంచాయతీలో 511 ఖాతాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ భూముల సరిహద్దుల్లో రాళ్ల ఏర్పాటుకు 2213 జగన్ బొమ్మలున్న రాళ్లను కేటాయించారు. సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఆ పనులు ఆగిపోయాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో వైసీపీ రీ సర్వేలకు బ్రేక్ పడింది. అలాగే భూసరిహద్దు రాళ్లపై ఉన్న జగన్ బొమ్మలు తొలగించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఆయా గ్రామాల్లో జరుగుతున్న జగన్ బొమ్మల తొలగింపు పనులను సబ్ కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించి పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమావేశం జరిగింది. స్థానిక కార్యాలయం వద్ద పలు సమస్యలను సబ్ కలెక్టర్ దృష్టికి ప్రజలు తీసుకెళ్లారు. పెద్దమండ్యం పరిధిలోని రెడ్డివారిపల్లి దళితులు శ్మశానవాటిక స్థలం కేటాయించాలని సబ్‌కలెక్టర్‌ను కోరారు. పెద్దమండ్యం తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, మండల సర్వేయర్ హసీన్‌తాజ్, వీఆర్వోలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.



శివపురం గొల్లపల్లి వద్ద భూసరిహద్దు రాళ్లను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

గత ఎన్నికల్లో కూటమి గాలి బలంగా వీచింది. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 164 చోట్ల కూటమి అభ్యర్థులు గెలుపొందారు. ఇంత విపరీతమైన గాలిలోనూ.. జిల్లాలో ఆరు సీట్లలో రెండు చోట్ల వైసీపీ అభ్యర్థులు గెలుపొందారు. వీరిలో రాజంపేట నుంచి ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, తంబళ్లపల్లె నుంచి పెద్దిరెడ్డి ద్వారకనాధరెడ్డిలు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. దీంతో ఈ నియోజకవర్గ ఓటర్లు ఒకింత నిరుత్సాహానికి గురైనా.. కనీసం తమ సమస్యలైనా అసెంబ్లీలో ప్రస్తావిస్తారు అని కలలు కన్నారు. కానీ అవి జరిగేలా లేవు. 10 రోజుల నుంచి అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నా ఇప్పటివరకు వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో అడుగుపెట్టకపోవడంతో 'జగనన్నా.. ఎంత తప్పు చేస్తున్నావ్.. మేము ఓట్లేసి గెలిపిస్తే.. ఎమ్మెల్యేలను అసెంబ్లీకి పంపవా' ? అంటూ ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాగైతే మా గోడు వినిపించేదెవరు ? పరిష్కారం చూపేదెవరు అంటూ మండిపడుతున్నారు.





ఆ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి దూరం

● ఎంత పని చేశావ్ జగనా..
● ఓట్లేసి గెలిపిస్తే.. ఎమ్మెల్యేలను అసెంబ్లీకి పంపవా..?
● అసెంబ్లీ ముఖం చూడని రాజంపేట, తంబళ్లపల్లె ఎమ్మెల్యేలు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2024 ఎన్నికల్లో కూటమి హవా కొనసాగింది. 11 మంది మినహా మిగిలిన వారందరూ కూటమి ఎమ్మెల్యేలు గెలుపొందారు. అన్నమయ్య జిల్లాలో మాత్రం రాజంపేట, తంబళ్లపల్లె నియోజకవర్గాల ప్రజలు వైసీపీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించారు. కానీ ఆ ఎమ్మెల్యేలు మాత్రం ఓటర్ల తీర్పును గౌరవించడం లేదు. ఈ నెల 11 నుంచి బడ్జెట్ సమావేశాలు మొదలై పదిరోజుల పాటు, 59 గంటల 57 నిమిషాలు జరిగాయి. సభ్యులు అడిగిన 75 ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు ఇచ్చారు. 21 ప్రభుత్వ బిల్లులకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశాలకు వైసీపీ ఎమ్మెల్యేలు హాజరు కాలేదు. తమ పార్టీ ఈ సమావేశాలను బహిష్కరిస్తున్నట్లు వైఎస్ జగన్ ప్రకటించారు. తనకు ప్రతిపక్ష నాయకుడి హోదా ఇస్తేనే.. అసెంబ్లీకి వస్తానని, అప్పుడే తమకు మైకు ఇస్తారంటూ పేర్కొన్నారు. దీంతో వైసీపీకి చెందిన ఎమ్మెల్యేలు కూడా అసెంబ్లీకి హాజరు కాలేదు. గెలిచిన ఆ ఎమ్మెల్యేలు ప్రజల అభిప్రాయాలను గౌరవించలేదు. అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలు ప్రస్తావించి.. పరిష్కారానికి కృషి చేస్తారనుకుంటే.. వాళ్లు అసలు అసెంబ్లీ ముఖమే చూడలేదు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకుని సమస్యలను తలచుకుని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఆయా ఎమ్మెల్యేలపైన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపైన పనిలో పనిగా.. జగనన్నా.. ఎంత తప్పు చేశావు..? ఓట్లేసి గెలిపించిన మీ ఎమ్మెల్యేలను అసెంబ్లీకి పంపకుండా.. అడ్డుకుంటావా? తమ సమస్యలు అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లేదెవరు? పరిష్కారానికి కృషి చేసేదెవరని తీవ్ర స్వరంతో ప్రశ్నిస్తున్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోనప్పుడు.. అసెంబ్లీకి వెళ్లనప్పుడు.. తమ పదవులకు రాజీనామాలు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో వైసీపీ తరఫున ఎమ్మెల్యేలుగా గెలిచి.. అసెంబ్లీకి ముఖం చాటేసిన రాజంపేట, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలపై ఆంధ్రజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం.

రాజంపేట నియోజకవర్గంలో..

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే.. అన్నమయ్య ప్రాజెక్టు వరద నీటికి కొట్టుకుపోయింది. అప్పట్లో వైసీపీ నాయకుల అక్రమ ఇసుక వ్యాపార దాహానికే ఈ విషాదకర ఘటన జరిగింది. అప్పట్లో ఈ ఘటన ప్రపంచ దేశాలలో మన దేశం పరువు పోవడానికి కారణమైందనే చెప్పవచ్చు. 2021లో ప్రాజెక్టు కొట్టుకుపోతే.. మిగిలిన మూడు సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పటికీ వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణం గురించి పట్టించుకోలేదు. ఇప్పటికీ సర్వం కోల్పోయిన వాళ్లకు కనీసం ఇళ్లు కూడా పూర్తి స్థాయిలో నిర్మించి ఇవ్వలేదు. ప్రాజెక్టును పునఃనిర్మించేందుకు పైసా డబ్బు విదిల్చలేదు. స్థానిక శాసనసభ్యులు ఈ సమావేశాలకే హాజరై ఉంటే.. తప్పకుండా అన్నమయ్య ప్రాజెక్టు గురించి చర్చించే అవకాశం ఉండేది. తమ ప్రభుత్వ హయాంలో బాధితులకు సాయం లేకపోయినా.. కూటమి ప్రభుత్వంలో అయినా.. ఎంతో కొంత ఆదుకునేందుకు వీలు కలిగేదని పలువురు పేర్కొంటున్నారు. ఇదొక్కటే కాకుండా.. పింఛా, ఝరికోన ప్రాజెక్టులు పూర్తయి.. కాలువల నిర్మాణం కూడా పూర్తయితే.. నియోజకవర్గ ప్రజలకు ఎంతో మేలు కలుగుతుంది. ఇంకా అనేక ప్రధాన సమస్యలు నియోజకవర్గంలో తిష్టవేసి ఉన్నాయి. ఎమ్మెల్యేలు ఈ సమావేశాలకు హాజరై ఉంటే.. వీటి గురించి కూడా సభలో చర్చించే అవకాశం ఉండేది.

తంబళ్లపల్లె నియోజకవర్గంలో...

కరువు ప్రాంతమైన తంబళ్లపల్లె నియోజకవర్గంలో ముదివేడు రిజర్వాయర్ పనులను వైసీపీ ప్రభుత్వం ఎటువంటి అనుమతులు లేకుండానే చేపట్టింది. వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. ఇప్పటికీ ప్రాజెక్టు పూర్తి కాలేదు. రైతులకు పైసా నష్టపరిహారం ఇవ్వకుండానే.. ఎటువంటి పునరావాస ఏర్పాట్లు చేయకుండానే.. పనులు దౌర్జన్యంగా చేసేశారు. కోర్టు ఆదేశాల మేరకు.. ప్రస్తుతం ఈ పనులు నిలిచిపోయాయి. కురబలకోట మండలంలో చింతపండు కుటీర పరిశ్రమగా పదివేల మందికి పైగా ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారు. కోల్డ్ స్టోరేజ్‌లు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నియోజకవర్గంలో ఎక్కువ మంది రైతులు టమోటా సాగు చేస్తున్నారు. కోల్డ్ స్టోరేజ్‌లు లేక.. సరైన ధరలు లేని సమయంలో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ప్రాంతం నుంచి ఎక్కువగా ప్రజలు ఉపాధి కోసం బెంగుళూరుకు వలసలు వెళ్తున్నారు. ఇవే కాకుండా.. నియోజకవర్గ వ్యాప్తంగా ఇంకా అనేక సమస్యలు ఉన్నాయి. స్థానిక ఎమ్మెల్యే అసెంబ్లీ సమావేశాలకు హాజరై ఉంటే.. తప్పకుండా ఈ సమస్యలపై సభలో చర్చించే అవకాశం ఉండేది.

ప్రజాతీర్పును అగౌరవ పర్చడమే..



ప్రజలు ఎంతో నమ్మకంతో ఓట్లు వేసి ఎమ్మెల్యేలుగా గెలిపించారు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయింది. మూడేళ్ల అధికారంలో ఉన్నప్పటికీ వైసీపీ నేతలు ఆ ప్రాజెక్టు గురించి పట్టించుకోలేదు. స్థానిక శాసనసభ్యులు సభకు హాజరై.. ప్రజల సమస్యలు చర్చించాల్సి ఉంది. పక్క నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు అసెంబ్లీలో తమ నియోజకవర్గాలకు చెందిన సమస్యలు చర్చించారు. రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలన్న డిమాండ్ ప్రజల్లో ఉంది. కానీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లకపోవడం.. ఖచ్చితంగా నియోజకవర్గ ప్రజల తీర్పును అగౌరవపర్చడమే.

\- సుగవాసి బాలసుబ్రమణ్యం, టీడీపీ ఇన్‌చార్జ్, రాజంపేట

సభకు హాజరుకాకపోవడం దారుణం..



ప్రజలు ఓటు వేసి గెలిపిస్తే.. శాసనసభలో ప్రజల సమస్యలపై చర్చించాల్సిన స్థానిక ఎమ్మెల్యే సభకు హాజరు కాకపోవడం దారుణం. నియోజకవర్గంలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల గోడు పట్టించుకోని ఎమ్మెల్యే.. సభకు హాజరుకానందుకు తన పదవికి రాజీనామా చేయాలి.

\- దాసరిపల్లె జయచంద్రారెడ్డి, టీడీపీ ఇన్‌చార్జ్, తంబళ్లపల్లె

అసెంబ్లీలో ప్రస్తావించేవారు లేరు..



తంబళ్లపల్లె నియోజకవర్గ సమస్యల గురించి అసెంబ్లీలో ప్రస్తావించే వారు లేకపోవడం బాధాకరం. ప్రజా ప్రతినిధులుగా గెలిచిన వారు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. సమస్యలు, అభివృద్ధి గురించి అసెంబ్లీలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తే పరిష్కారం లభిస్తుంది. ప్రతి ఎమ్మెల్యే అసెంబ్లీకి హాజరైతే మంచిది.

\- వెంకటరమణ, ములకలచెరువు

అసెంబ్లీకి వెళ్లని ఎమ్మెల్యేలు ఎందుకు..



అసెంబ్లీకి కూడా వెళ్లని ఎమ్మెల్యేలు ఎందుకు. అసలు వాళ్లు ఎన్నికల్లో పోటీ చేయడం ఎందుకు? అసెంబ్లీకి వెళ్లకుండా ఇంటి దగ్గర ఉండడం దేనికి..? ప్రజాప్రతినిధిగా ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటూ.. అసెంబ్లీకి వెళ్లకపోవడం దారుణం. పట్టణం గత ఐదేళ్లలో అభివృద్ధి చెందలేదు.

\- టి.లక్ష్మీనారాయణ, పార్లమెంటు టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు, రాజంపేట

తహసీల్దార్, వీఆర్వోపై కేసు నమోదు

తంబళ్లపల్లె, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఒక రైతుకు చెందిన భూమిని వారి అనుమతి లేకుండా మరో రైతుకు ఆన్‌లైన్ చేసి, వన్‌బీ, పట్టాదారు పాస్‌బుక్ మంజూరు చేశారనే కారణంతో గతంలో తంబళ్లపల్లె తహసీల్దారుగా పనిచేసిన సీకే శ్రీనివాసులు, వీఆర్వో విశ్వంభరనాయుడుపై కేసు నమోదైన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్‌ఐ లోకేశ్‌రెడ్డి కథనం మేరకు.. తంబళ్లపల్లె మండలం గోపిదిన్నె పంచాయతీ జల్లావారిపల్లెకు చెందిన కె.మల్‌రెడ్డి.. టీఎస్ శ్యామలమ్మ నుంచి 606 సర్వే నెంబరులో 75 సెంట్లు భూమిని కొనుగోలు చేశాడు. కాగా మల్‌రెడ్డి 2014 మార్చిలో మృతి చెందాడు. ఈ భూమిని తమ కుటుంబీకుల అనుమతి లేకుండా అప్పటి తహసీల్దారు సీకే శ్రీనివాసులు, గోపిదిన్నె వీఆర్వో విశ్వంభరనాయుడులు 606/జె1గా సబ్ డివిజన్ చేశారు. అదే గ్రామంలోని బంధువైన వి.శివారెడ్డి పేరుతో ఆన్‌లైన్ చేసి వన్‌బీ, పట్టాదారు పాస్‌బుక్ మంజూరు చేశారని మృతుడి కుమారుడు రెడ్డిశేఖర్‌రెడ్డి తంబళ్లపల్లె సివిల్ కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించాలని పోలీసులకు కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ మేరకు ఈనెల 5న అప్పటి తహసీల్దారు, వీఆర్వోపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పూర్వపు ఆర్డీవో మురళి సస్పెన్షన్ కొనసాగింపు

రాయచోటి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పూర్వపు ఆర్డీవో, ప్రస్తుత తిరుపతి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మురళి సస్పెన్షన్‌ను పొడిగిస్తూ శుక్రవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. విధి నిర్వహణలో 22ఏ, ఫ్రీహోల్డ్ ఫైళ్లలో ఆర్డీవోగా పనిచేస్తున్న సమయంలో ఇతను అనేక అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై ఏసీబీ అధికారులు అప్పట్లో కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఈయనపై ఉన్న సస్పెన్షన్‌ను పొడిగిస్తున్నామని, ప్రభుత్వ అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్ వదిలి వెళ్లకూడదని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇతనిపై తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా సీసీఎల్ఏ అధికారులను ఆదేశించారు.

సీతాఫలం సాగులో
సఫలం
● మొదటిసారిగా సాగు



6

టౌన్‌బ్యాంకు ఎన్నికకు
ముగిసిన నామినేషన్ల పర్వం

● ఒకే ప్యానల్.. 12 మంది డైరెక్టర్లు ● చైర్మన్ సహా అందరూ ఏకగ్రీవమే

మదనపల్లె, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణ బ్యాంకు ఎన్నికల్లో కీలక ఘట్టమైన నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ముగిసింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ జరిగిన ఈ ప్రక్రియ ప్రశాంతంగా సాగగా, అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అందరూ ఊహించినట్లే ఒకే ప్యానల్‌లో 12 మంది డైరెక్టర్లే ఎన్నికల బరిలో ఉండటం విశేషం. రెండోప్యానల్‌తో పాటు అదనంగా మరో డైరెక్టర్ కూడా ఎన్నికల పోటీలో లేకపోవడంతో ఏకగ్రీవానికి మార్గం సుగమమైంది. చైర్మన్ అభ్యర్థి నాదెళ్ల విద్యాసాగర్ చెబుతున్న ప్యానల్‌లో డైరెక్టర్లుగా నిమ్మనపల్లె ముక్తియార్‌ఖాన్, సూరె రవీంద్రనాథ్, నవరం భాస్కర్‌కుమార్, నాదెళ్ల విద్యాసాగర్, రాటకొండ సోమశేఖర్, దిగువపాళెం నిరంజన్ కుమార్, నాదెళ్ల వెంకటేశ్వరప్రసాద్, శ్రీరామ రవికాంత్‌బాబు, రామిశెట్టి భాస్కర్, ఆకుల కృష్ణమూర్తి, పఠాన్ సర్దార్‌ఖాన్, జోళపాళెం కృష్ణమూర్తి దేవేంద్రబాబులు నామినేషన్లు వేసిన వారిలో ఉన్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా శనివారం ఉదయం 10గంటల నుంచి నామినేషన్ల పరిశీలన, ఆదివారం ఉదయం 10గంటలకు నుంచి సాయంత్రం 5గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. అనంతరం చివరగా బరిలో నిలిచిన అభ్యర్థులను ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి బి.దుర్గమ్మ ప్రకటించనున్నారు. అనంతరం 12 మంది డైరెక్టర్లకు ధ్రువీకరణ పత్రం అందజేయనున్నారు. నామినేషన్లు దాఖలు చేసిన వారిలో గత పాలకవర్గంలోని ఏడుమంది పాత డైరెక్టర్లే పోటీపడడం విశేషం. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకూ చైర్మన్, వైస్‌చైర్మన్ల ఎన్నిక నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియలో ఎన్నికల అధికారి బి.దుర్గమ్మ, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు ఎ.ప్రవీణ్‌కుమార్, శ్యామ్‌ప్రకాష్‌రెడ్డి, రఘునాథరెడ్డి, స్వర్ణలత, దీప, తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న చైర్మన్ అభ్యర్థి నాదెళ్ల విద్యాసాగర్

టౌన్‌బ్యాంకు వద్ద ఎన్నికల సందడి

టౌన్‌బ్యాంకు ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కూటమి పార్టీల నేతలు, కార్యకర్తల సందడి నెలకొంది. ముఖ్యంగా డైరెక్టర్లు అంతా తమ మద్దతుదారులు, అభిమానులతో వచ్చి నామినేషన్లు వేశారు. అలాగే చైర్మన్ అభ్యర్థి నాదెళ్ల విద్యాసాగర్ నామినేషన్‌కు మదనపల్లె నియోజకవర్గం నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు. నామినేషన్ల స్వీకరణ గడువు పూర్తయిన సాయంత్రం 4గంటల తర్వాత బ్యాంకు ముందు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. విద్యాసాగర్‌కు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఎన్నడూ లేని విధంగా టౌన్‌బ్యాంకు ఎన్నికలు ఏకగ్రీవం కావడం అధికారంలోకి వచ్చిన మొదట్లోనే కూటమి ప్రభుత్వం సాధించిన విజయంగా చైర్మన్ అభ్యర్థి నాదెళ్ల విద్యాసాగర్ అభివర్ణించారు. దీనికి సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా ఘనతగా పేర్కొన్నారు.

తవ్వుకో.. అమ్ముకో..!

ఇసుక ఉచితం.. ఇది ప్రభుత్వం చెప్పిన మాట. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా సీఎం చంద్రబాబు పేదలకు సొంతింటి అవసరాలకు ఉపయోగపడేందుకు ఈ పథకం అమలు చేశారు. కానీ ఇప్పుడు ఇదే అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. బాహుదాను ఇష్టానుసారం తవ్వేసి బయట ప్రాంతాలకు అక్రమ రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పట్టపగలే ఇసుక మాఫియా ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నా పట్టించుకోవాల్సిన రెవెన్యూ సిబ్బంది చోద్యం చూస్తున్నట్లు విమర్శలున్నాయి. తద్వారా బాహుదా కాలువ ఆనవాళ్లు లేకుండా పోతోంది. ఇదేకాకుండా భోగంపల్లె రిజర్వాయర్‌ను సైతం ఇసుక తవ్వకాలతో గుల్ల చేస్తున్నారు.




వాల్మీకిపురం గుండా మదనపల్లెకు ట్రాక్టర్లలో ఇసుక అక్రమ రవాణా

● 'బాహుదా'ను చెరబట్టారు
● రిజర్వాయర్‌నూ వదల్లేదు
● పట్టపగలే అక్రమ రవాణా
● అడ్డుకునే వారేరీ..?



వాల్మీకిపురం మండలం కూరపర్తి వద్ద బాహుదా కాలువ దుస్థితి (ఫైల్‌ఫోటో)



వాల్మీకిపురం సమీపంలో రహస్య ఇసుక డంపింగ్‌లు

వాల్మీకిపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ఇసుక ధరలతో సామాన్యులు విలవిల్లాడిపోయారు. భవన నిర్మాణ కార్మికులు సైతం పనులు లేక ఇబ్బందులు పడ్డారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఉచిత ఇసుక అమలు చేసింది. స్థానిక అవసరాలకు వాడుకోవాలని సూచించింది. ఇదే అదునుగా ఇసుక మాఫియా రెచ్చిపోయింది. ఎక్కడపడితే అక్కడ ఇష్టం వచ్చినట్లు తవ్వేస్తున్నారు. స్థానిక అవసరాలకు కాకుండా బయట ప్రాంతాలకు రవాణా చేస్తూ లక్షలు సంపాదిస్తున్నారు. వాల్మీకిపురం మండలం నుంచే నిత్యం వదుల సంఖ్యలో ఇసుక ట్రాక్టర్ల ద్వారా బయటకు తరలించేస్తున్నారు. వాల్మీకిపురం మొదలు కూరపర్తి, మూగలమర్రి, చింతపర్తి, మంచూరు, మాధవరం పల్లె తదితర గ్రామాల గుండా వెళ్లే బాహుదా కాలువ ఆనవాళ్లు లేకుండా పోతోంది. పలు సందర్భాల్లో మండలంలోని పలు గ్రామాల రైతులు, ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేసినా ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న దాఖలాలు లేవన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఓ వైపు ప్రభుత్వం స్థానిక అవసరాలకు ఇసుక ఉచితం అంటుంటే ఇదే అదునుగా కొందరు మదనపల్లె, తదితర ప్రాంతాలకు అక్రమ రవాణా సాగిస్తున్నారు. ఈ వ్యవహారంలో అధికారులు కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం. మండల వ్యాప్తంగా బాహుదా కాలువ కనీసం ఆనవాళ్లు లేకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా పట్టణానికి సమీపంలోని భోగంపల్లె రిజర్వాయర్‌ను సైతం ఇసుక తవ్వకాలతో గుల్ల చేస్తున్నారు. ఎవరికి తోచిన చోట వారిదే ఇష్టారాజ్యం అన్నట్లు వ్యవహరిస్తూ ఇసుక మాఫియాకు అడ్డేలేకుండా పోతోంది. అంతే కాకుండా రిజర్వాయర్ నుంచి పట్టణానికి తాగునీరు సరఫరా చేసే పైపులైన్లు కూడా ధ్వంసం చేస్తుండటం విచారకరం. ఇష్టారాజ్యంగా ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు పాల్పడుతున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని మండల వ్యాప్తంగా రైతులు, ప్రజలు కోరుకుంటున్నారు.



వాల్మీకిపురం భోగంపల్లె రిజర్వాయర్ నుంచి తోడేస్తున్న ఇసుక

ఇసుక, మట్టి అక్రమ రవాణా సహించం

మండల వ్యాప్తంగా ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు, రవాణాను సహించేది లేదు. స్థానిక అవసరాలకు కాకుండా బయటి ప్రాంతాలకు ఇసుక అక్రమ రవాణా చేస్తే ఎంతటి వారైనా సహించేది లేదు. చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. గ్రామీణ ప్రాంతాల రైతులు కూడా ఇసుక అక్రమ రవాణా సమాచారం ఇస్తే తప్పక చర్యలు తీసుకుంటాం.

\- పామిలేటి, తహసీల్దార్, వాల్మీకిపురం

చిరుత సంచారంతో భయం గుప్పెట్లో ప్రజలు


చిరుతపులి దాడిలో గాయపడిన దూడ

నిమ్మనపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో చిరుతపులి సంచారంతో ప్రజలు బెంబేలెత్తున్నారు. శుక్రవారం తవళం పంచాయతీ ఎగువపల్లికి చెందిన రైతు శ్రీనివాసులు తన వ్యవసాయ పొలం వద్ద ఆవులను కట్టేశాడు. కట్టేసిన దూడపై చిరుత పులిదాడి చేసింది. అయితే దూడ చిరుతపులి నుంచి తప్పించుకుని ఇంటికి చేరింది. అప్పటికే చిరుత దాడి చేయడంతో వళ్లంతా రక్తం కారుతోంది. విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఇటీవల చల్లావారిపల్లి, పారేసువారిపల్లెల్లో ఒక ఆవును, మేకను తిన్న విషయం తెలిసిందే. దీంతో సమీప గ్రామస్తులు భయభ్రాంతులు చెంది కొండ సమీపంలోకి గొర్రెలు, మేకలు, పాడి ఆవులు తోలేందుకు సాహసించడంలేదు. కొద్ది రోజులుగా చిరుతపులి సంచరిస్తున్నా అటవీ శాఖ అధికారులకు మాత్రం చీమ కుట్టినట్టైనా లేదు. చిరుతను బంధించేందుకు కనీస చర్యలు కూడా తీసుకోక పోగా చిరుతను వేటాడకూడదని చెబుతుండం గమనార్హం. ఇదిలాగే కొనసాగితే ఎవరో ఒకరు చిరుతకు బలికావల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

190 లీటర్ల నాటుసారా స్వాధీనం - వ్యక్తి అరెస్టు


రవినాయక్‌ను అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

మదనపల్లె టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం నారమాకుల తండా నుంచి 190 లీటర్ల నాటుసారా తరలిస్తున్న రవినాయక్‌ను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం ఉదయం మాలేపాడు క్రాస్ వద్ద ఎక్సైజ్ సీఐ భీమలింగ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా నారమాకులతండా వాసి బుక్కే రవినాయక్ బైక్‌లో 190 లీటర్ల నాటుసారా తరలిస్తూ పట్టుబడ్డాడు. దీంతో నాటుసారా, బైక్‌ను సీజ్ చేసిన ఎక్సైజ్ పోలీసులు రవినాయక్‌ను అరెస్టు చేశారు. సారా కొనుగోలు చేసేందుకు ఆర్డర్ ఇచ్చిన నక్కలదిన్నెతండాకు చెందిన బుక్కే పద్మావతి మీద కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. అలాగే కురబలకోట మండలం తెట్టుగ్రామం వద్ద కర్ణాటక మద్యం విక్రయిస్తున్న జి.అనురాధను అరెస్టు చేసి ఆమె వద్ద 76 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు. ఈ రెండు కేసుల్లో పట్టుబడిన నిందితులిద్దరినీ రిమాండ్‌కు తరలించామని సీఐ పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు డేర్యాస్, జబీవుల్లా, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

26న జానపద నృత్య పోటీలు

రాయచోటిటౌన్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ, రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో డైట్ కళాశాలలో 26న జిల్లా స్థాయి బాలరంగ్ జానపద నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. విద్యార్థుల్లో జాతీయ స్ఫూర్తిని పెంపొందించడం, విభిన్న సాంస్కృతిక విలువలపై అవగాహన పెంపొందించడం ప్రధాన ఉద్దేశమన్నారు. తప్పెటగుళ్లు, కర్రసాము, చెంచులవేట, థింసా, జాలరి, బంజారా మొదలైన జానపద నృత్య గీతాలు ప్రదర్శించవచ్చన్నారు. నృత్య, గాత్ర, వాయిద్య, నైపుణ్యం గల విద్యార్థులు ఒక సమూహంగా (గరిష్ఠంగా 15 మంది విద్యార్థులు) పాల్గొనవచ్చన్నారు. జిల్లా జట్లు తప్పనిసరిగా తమ ప్రాంతంలోని సంప్రదాయ జానపదాలను మాత్రమే ప్రదర్శించాలన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే విద్యార్థులందరూ తప్పనిసరిగా గుర్తింపు కార్డులు కలిగి ఉండాలన్నారు. జిల్లా నుంచి ఒక ఉత్తమ జట్టును మాత్రమే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. ఉపాధ్యాయులు పిల్లల ఆసక్తిని గమనించి వారిని ప్రోత్సహించి, ప్రధానోపాధ్యాయుడి ద్వారా విద్యార్థుల జాబితాను డైట్ లెక్చరర్ అసదుల్లాబాషా మొబైల్ నెంబర్ 9440084715కు వాట్సాప్ చేయాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

క్రిటికల్ కేర్ బ్లాక్ కోసం రూ.30 కోట్లు మంజూరు చేయండి

మంత్రి సత్యకుమార్‌ను కోరిన మంత్రి మండిపల్లి


మంత్రి సత్యకుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న మంత్రి మండిపల్లి

రాయచోటిటౌన్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): రాయచోటిలో క్రిటికల్ కేర్ బ్లాక్ (సీసీబీ) ఏర్పాటుకు రూ.30 కోట్లు మంజూరు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను రవాణా, యువజన, క్రీడా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కోరారు. భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్రిటికల్ కేర్ బ్లాక్‌ల ఏర్పాటు విధానం ద్వారా తీవ్రమైన కేసులకు చికిత్స అందించే సౌకర్యాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని, మంత్రి సత్యకుమార్‌ను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కోరారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా క్రిటికల్ అండ్ ట్రామా కేర్ సేవలను రోగులకు ప్రత్యేక సంరక్షణ, పర్యవేక్షణ అవసరం కాబట్టి, ప్రస్తుతం సామర్థ్యం సరిపోదని, అందుకోసం రాయచోటిలో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ ఏర్పాటుకు రూ.30 కోట్లు మంజూరు చేయాలని మంత్రి కోరిన వెంటనే ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సానుకూలంగా స్పందించి రూ.30 కోట్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

మదనపల్లె టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తన తండ్రికి ద్రోహం చేశాడనే కోపంతో ఓ వ్యక్తి పిల్లనిచ్చిన మామనే హత్య చేసి జీవిత ఖైదు శిక్షకు గురయ్యాడు. వివరాల్లోకెళితే... సోమల మండలం నెల్లిమంద పంచాయతీ గొల్లపల్లె వాసి వెంకటసిద్దులు కుమార్తె సిద్ద రత్నమ్మను కలికిరి మండలం గుట్టపాళెం వాసి రెడ్డెప్ప కుమారుడు సుధాకర్‌కు ఇచ్చి వివాహం చేశాడు. కాగా అప్పట్లో రెడ్డెప్ప అనారోగ్యానికి గురవగా, తన మామ వెంకటసిద్దులే తన తండ్రికి చేతబడి చేశాడనే అనుమానంతో మామపై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో 2017 ఆగస్టు 7న వెంకటసిద్దులు పొలంలోనే హత్యకు గురయ్యాడు. దీంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో చౌడేపల్లె సీఐ రవీంద్ర కేసు దర్యాప్తులో పలు అంశాలు వెలుగు చూశాయి. పొలం వద్ద వున్న వెంకటసిద్దులును సుధాకర్ కొడవలితో నరికి హత్య చేశాడు. కాగా సుధాకర్, బావమరిది రెడ్డెప్పతో కలసి హత్య చేశామని వీఆర్‌ఓకు వివరించారు. వీఆర్‌ఓ సమాచారంతో పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు పంపారు. ఈ కేసు కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు విధించారు.

వీఆర్‌ఏ శాంతమ్మపై బెదిరింపులు

ఒంటిమిట్ట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఓబులేశుకోనలో ప్రభుత్వ భూమి ఆక్రమణను అడ్డుకున్న వీఆర్‌ఏ శాంతమ్మను పరుషపదజాలంతో దూషించారని బాధితురాలు తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో పెన్నపేరూరు వీఆర్‌ఏ శాంతమ్మ, గంగపేరూరు వీఆర్‌ఏ రమణ ఆక్రమిత సర్వేనంబరు 661లో ప్రభుత్వ భూమిని ఆక్రమించ వద్దని నిబంధనల ప్రకారం రికార్డులు తహసీల్దారుకు చూపించాలని గురువారం రాత్రి ఇంటి వద్దనున్న సుధాకర్‌కు తెలిపారు. వెంటనే సుధాకర్, వారి కుటుంబ సభ్యులు వీఆర్‌ఏ శాంతమ్మపై తమ పనులను అడ్డుకుంటావా నీశక్తి ఎంత, నీకులం ఏది అని పరుషపదజాలంతో పెద్ద ఎత్తున దూషించినట్లు బాధితురాలు ఫిర్యాదు చేశారు. దీనిపై వీఆర్వో ఆంజనేయులు క్షేత్రస్థాయిలో విచారించి తహసీల్దారుకు నివేదిక అందించారు. దీనిపై తహసీల్దారు రమణమ్మను వివరణ కోరగా తమ వీఆర్‌ఏని ఇబ్రహీంపేట వాసి సుధాకర్ దూషించారని అతనిపై శనివారం పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించడమేగాక సిబ్బందిని దూషించడం తప్పన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యలతో ఓ యువతి విషంతాగి ఆత్మహత్యకు యత్నించిందని పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మదనపల్లె పట్టణం, బుగ్గకాల్వ చెందిన యువతి తండ్రి కొద్దికాలం కిందట చనిపోయాడు. తల్లి తనను వదిలేసి దూరంగా ఉంటోంది. దీంతో మనస్తాపానికి గురైన యువతి విషం తాగి అపస్మారకస్థితిలో పడిఉండడానికి గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ ఎస్‌ఐ అన్సర్ బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పెన్నాతీరం... మునెయ్య నిలయం

● మహిమాన్వితుడు మునెయ్యస్వామి ● 25న తిరుణాళ్ల

● రాష్ట్రం నలుమూలల నుంచి భక్తుల రాక


స్వామి వారికి పూలతో అలంకరించిన పట్టుమెత్త

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సుమారు 12 ఏళ్ల ప్రాయంలోనే యాగంటి నుంచి ప్రొద్దుటూరు రామేశ్వరానికి వచ్చిన దొంగకోళ్ల మునిస్వామిగా వ్యవహరించే మునెయ్య స్వామి తిరుణాళ్ల సోమవారం వేడుకగా నిర్వహించనున్నారు. అవధూతగా, సిద్ధపురుషుడిగా పేరుపొందిన మునెయ్యస్వామి కార్తీక మాసం చివరి సోమవారం సజీవ సమాధి అయిన రోజు కావడంతో ఆరోజున ప్రత్యేకించి తిరుణాళ్ల నిర్వహిస్తుంటారు. మునెయ్యస్వామి భక్తులపాలిట కొంగు బంగారంగా పేరుపొందారు. స్వామి మహిమల గురించి తెలియడంతో దేశ వ్యాప్తంగా భక్తులు ఉన్నారు. రామేశ్వరంలోని పెన్నాతీరంలో వెలసిన మునెయ్యస్వామి ఆలయంలో 25వ తేదీ కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా తిరుణాళ్ల జరుగనుంది. మునెయ్య మునిస్వామి మహిమలు, మహత్యం గురించి విస్తృత ప్రచారంలో ఉన్నాయి. ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం సమీపంలో 400 ఏళ్ల కిందట మునెయ్యస్వామి సజీవ సమాధి అయ్యారని చరిత్ర చెబుతోంది.

● మునెయ్యస్వామి చరిత్ర

స్వామి 12 ఏళ్లలోనే యాగంటిలో ఉండగా రాజ రాజేశ్వరిదేవి అమ్మవారి దర్శనం అవడం, ఆమె ఆదేశానుసారం రామేశ్వరానికి వచ్చినట్లు పేర్కొంటారు. ఇక్కడికి వచ్చిన ఆయన పాత కోట బయపురెడ్డి ఇంటికి వచ్చి వెళ్లేవారు. కురచగా ఉంగరాల జుట్టుతో గోచి మాత్రమే ధరించి బాలుడి రూపంలో పిల్లలతో కలిసి ఆడిపాడి అలసిపోయి రాజరాజేశ్వరి దేవి ఆలయంలో విశ్రాంతి తీసుకునేవారు. పెన్నాతీరం బాలుడి ఆటస్థలంగా మారడంతో తోటి పిల్లలతో గోలీలు, బొంగరాలు ఆడుతూ వారి బొంగరాలు పగులకొట్టేవాడు. ఇసుక తీసుకుని పిల్లల చేతిలో పోస్తే అది చక్కెరగా మారేదని, అందుకే పిల్లలు ఎప్పుడూ ఆయన వెంట తిరిగేవారన్నారు. అయితే అప్పట్లో పెన్నాతీరం అడవిని పోలి ఉండడంతో ఆ అడవిలో తిరిగే పులులు, పాములతో సరదాగా ఆడుకునేవాడు. ఆకలైతే కోళ్లను దొంగిలించి తీసుకెళ్లి తింటుండడంతో ఆయనను దొంగకోళ్ల మునిస్వామిగా పిలిచేవారు. మౌనవ్రతం చేపట్టి ఎవరితో మాట్లాకుండా ఉండడంతో ఆయనను మౌనిస్వామిగా పిలుస్తుండగా కాలక్రమంలో మునెయ్యస్వామిగా పిలుస్తున్నారు. మునెయ్యస్వామి అనుగ్రహంతో పుట్టిన పిల్లలకు మునెయ్య, మునెమ్మ, మునిరాజు పేర్లు పెట్టుకుని స్వామివారిని తమ ఇంటి దేవుడిగా భక్తులు కొలుస్తున్నారు. మునెయ్యస్వామి ఉన్నట్లుండి గాలిలో చూస్తూ అదిలించేవారు. ఏమైందని అడిగితే అడవిలో గొవులపై పులి దాడి చేయబోతే తరిమేశానని చెప్పేవాడు. రైతులు వర్షం కురవడంలేదని అడిగితే ఆ రోజు రాత్రే వర్షం కురిసేదంటారు. బయపురెడ్డి ఇంటికి వస్తుండడంతో ఆ ఇంటివారికి తన మహిమలు చూపి ఆ ఇంటి ఇలవేల్పుగా మారారు. స్వామి తన 40వ ఏట కార్తీక మాసం చివరి సోమవారం పాతకోట ఎల్లారెడ్డి స్థలంలో సజీవ సమాధి అయ్యారు. సమాధి అయ్యే ముందు ఆయన వెలిగించిన దీపం ఇప్పటికీ వెలుగుతూ భక్తులకు దర్శనమిస్తోంది. నాటి నుంచి కార్తీక మాసం చివరి సోమవారం మునెయ్యస్వామి తిరుణాళ్లను నిర్వహిస్తున్నారు. తిరుణాళ్ల సందర్భంగా భక్తులు కోళ్లు, మేకలను బలి ఇస్తారు. కొందరు భక్తులు తలనీలాలు, పుట్టు వెంట్రుకలు స్వామివారికి ఇస్తారు. ఆలయం గోపురంపైన చెక్కిన శిల్పాలు భక్తులను ఆకట్టుకుంటాయి. ఆలయం గోపురంపై గాంధీ, నెహ్రూ, సుభాష్‌చంద్రబోస్ వంటి దేశ నాయకుల విగ్రహాలు దేశభక్తిని పెంపొందిస్తాయి. ఆలయం లోపల గోపికల వస్త్రాలను అపహరించే శ్రీకృష్ణుడి విగ్రహం, నంది విగ్రహం, ఆదిశేషునిపై విష్ణుమూర్తి, భూమిలో కుంగిన రథ చక్రాన్ని పైకి ఎత్తుతున్న కర్ణుడు వంటి శిల్పాలు ఆకట్టుకుంటాయి.

మహిళలే పూజారులు

పాతకోట మునెమ్మ వైవాహిక జీవితాన్ని త్యజించి ఆలయంలో మునెయ్యస్వామిని సుమారు వందేళ్లకు పై వయసులో కూడా పూజలు చేసేది. పాతకోట ఎల్లారెడ్డి స్థలంలో ఆలయం నిర్మించడం, వారి ఇలవేల్పుగా నిలవడంతో పాలకోట వంశీకులే ఇప్పటికీ పూజారులుగా వ్యవహరిస్తున్నారు. మొదటి తరంలో మునెమ్మ అనే భక్తురాలు స్వామివారిని సేవించేది. ఆలయ అభివృద్ధికి కృషిచేసేవారు. అప్పటి నుంచీ నేటి వరకూ మహిళలే ఆలయంలో పూజలు నిర్వహిస్తుంటారు. సుమారు 380 ఏళ్లగా స్వామి వారి సేవ చేయడం తమ అదృష్టమని నేటి పూజారులు వివరిస్తుంటారు. కాగా స్వామి వారి సజీవ సమాధి పక్కనే ఒక పట్టె మంచం వేసి రాత్రికి పూలతో అలంకరించేవారు. తెల్లవారి చూస్తే ఒకరు పడుకుని నిద్రపోయిన విధంగా పూలు నలిగి ఉంటాయి. ఇప్పటికీ ఇలాగే జరుగు తుండడం ఆయన మహిమలకు తార్కాణమని భక్తుల విశ్వాసం. ఇంతటి మహిమాన్వితుడు అప్పట్లో వాడిన వస్తువులు ఉన్నాయి. ఆంధ్ర, తెలంగాణా, తమిళనాడు, కర్ణాటకల నుంచి భక్తులు తిరుణాళ్ల సందర్భంలో స్వామివారి దర్శనానికి వస్తుంటారు.




ఆలయం ముందు భాగం - మునెయ్యస్వామి మూలవిరాట్టు - గోపికల వస్త్రాలను అపహరిస్తున్న శ్రీకృష్ణుడు ప్రతిమ

సమస్యల పరిష్కారమే లక్ష్యం

అన్నిశాఖల అధికారులతో సమీక్షించిన కలెక్టర్ చామకూరి శ్రీధర్


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

సుండుపల్లె, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అన్నిశాఖల అధికారులు పనిచేయాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే వినతుల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలను తిప్పుకోకూడదన్నారు. ఫ్రీ హోల్డ్ భూములు, చుక్కల భూములు, మ్యుటేషన్లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థుల అపార్ ఐడీ, బ్యాంక్ అకౌంట్లకు ఆధార్ లింకేజీలను పరిశీలించి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలన్నారు. ప్రభుత్వ స్థలాలకు రక్షణ కల్పించాలని ఆదేశించారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

వైసీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని కలెక్టర్ హౌసింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల వ్యాప్తంగా 2,352 గృహాలు మంజూరయ్యాయని, 1096 మాత్రమే పూర్తి చేశారని, 573 పనులు ప్రారంభించకపోవడంతో వాటిని లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించామన్నారు. ఇంకా 683 గృహ నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉందన్నారు. 2025 ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. పూర్తి చేయకపోతే స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామన్నారు.

మండల తీర్మానం ఇవ్వరా....

పల్లె పండుగలో భాగంగా నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించేందుకు మండల తీర్మానం ఇవ్వరా అని కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. గ్రామ సభల ద్వారా గుర్తించిన రోడ్లు లేని ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించిందన్నారు. సత్వరం పనులు ప్రారంభించేందుకు మండల తీర్మానం, పనుల నివేదికను అందించాలని ఎంపీడీఓ సుధాకర్ రెడ్డిని ఆదేశించారు.

వినతుల వెల్లువ

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, రాష్ట్ర మంతా పల్లెపండుగలో భాగంగా అభివృద్ధి పనులు జరుగుతుంటే సుండుపల్లె మండలంలో మాత్రం పనులు ప్రారంభం కాలేదని టీడీపీ, బీజేపీ నేతలు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. రోళ్లమడుగు నీటి పథకం పనులు అర్ధంతరంగా ఆగిపోయాయని, ఝరికోన ప్రాజెక్టు నుంచి రైతుల కోసం సాగు నీటి కాల్వలు ఏర్పాటు చేయాలని, కమ్మ గుట్టపల్లె గ్రామస్తులు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ వెంకటరత్నం, హౌసింగ్ పీడీ సాంబశివయ్య, తహసీల్దార్ దైవాధీనం, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఏపీఓ మాలిక్‌బాషా, ఏపీఎం శ్రీనివాసులు, మండల సర్వేయర్ వెంకటసుబ్బయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్, వ్యవసాయశాఖ అధికారి మహబూబ్‌బాషా, సచివాలయ ఉద్యోగులు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

'భూమిని కాజేసే వారిపై చర్యలు తీసుకోండి'

గాలివీడు, నవంబరు22(ఆంధ్రజ్యోతి): తప్పుడు పత్రాలు సృష్టించి భూమిని కాజేయాలని యత్నిస్తున్న జిలానీ బాషా, తదితరులపై అధికారులు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ భాగ్యలతకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకెళితే... మండల కేంద్రంలోని సర్వే నెంబరు 477, 475లలో హసనాపురం ఖాదర్ వలి మిరాయిగిరి నన్నేసాబ్, హసనాపురం ఖైరున్‌బీ, హసనాపురం జవుల్లా, షేక్. అఖిలభాను, షేక్. నసీబ్ జాన్, షేక్.అమీద, షేక్.శంషాద్ అనుభవదారుల పూర్వీకులకు ప్రభుత్వం భూమి ఇచ్చింది. దశాబ్దాలుగా సాగు చేసుకుంటూ జీవిస్తున్నారు. అయితే సంబంధం లేని ఇదే గ్రామస్తుడు జిలానీబాషా తప్పుడు డాక్యు మెంట్లు సృష్టించి దౌర్జన్యాలు చేస్తూ మమ్ములను అనేక ఇబ్బందులు పెడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సుమారు 80ఏళ్లగా సర్వే నెంబర్లు 477, 475లలో సాగు చేసుకుంటున్న భూమికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్స్ ఉన్నాయన్నారు. ఈ సమస్యపై జిల్లా ఉన్నతాధికారులకు మేము సాగు చేసుకుంటున్న భూమిలో వారెవరికీ హక్కులు లేవని ఫిర్యాదు కూడా చేశామన్నారు. నాడు రెవెన్యూ అధికారులపై సర్వే నెంబర్లలో వారికి ఆ భూమే లేదని లేఖ రూపంలో పంపారు. తప్పుడు ఎంజాయ్‌మెంట్ పొంది మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. రికార్డులను పరిశీలించి భూకబ్జాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుని వారి నుంచి మాకు ప్రాణ రక్షణ కల్పించి న్యాయం చేయాలని విన్నవించారు. వినతి పత్రం అందజేసిన వారిలో అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమణా రెడ్డి, బాధితులు ఉన్నారు.

సీతాఫలం - సాగులో సఫలం


కలిచెర్ల సమీపంలో సీతాఫలం తోట



మండలంలో మొదటి సారిగా సాగు

ఆదాయం మెండు

పెద్దమండ్యం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సీతాఫలం సీజన్ వస్తే అందరూ అడవుల్లో పండే ప్రకృతి సీతాఫలాలను తెచ్చుకుని లేదా కొనుగోలు చేసి తింటారు. అయితే ఈసీజన్ గ్రామీణ పేదలకు జీవనోపాధి. ఈసీజన్‌లో అడవులకు వెళ్లి సీతాఫలం తెచ్చికుని మాగబెట్టి అమ్ముకుంటుంటారు. దీంతో ఆర్థికంగా కొంత ఊపిరి పీల్చుకుంటారు. మండల రైతు అబ్దుల్లా సీతాఫలం సాగు చేస్తూ లాభాల్లో పురోగతి సాధిస్తున్నాడు. వివరాల్లోకెళితే... పెద్దమండ్యం మండలం కలిచెర్లకు చెందిన అబ్దుల్లా తన ఆరెకరాల్లో సీతాఫలం తోట సాగు చేసి మంచి దిగుబడులు సాధిస్తున్నారు. ఈ సీతాఫలం మన ప్రాంతంలో తోటలు సాగు చేయడం విశేషం. దీంతో సీతా ఫలం సాగుపై మండల రైతుల దృష్టి మళ్లింది. సస్యర క్షణ శ్రమ తక్కువ, ఆదాయం ఎక్కువ తెచ్చే పంట సీతాఫలం తోటల సాగుపై రైతు పలు అంశాలు వెల్లడించారు. మూడేళ్ల కిందట సీతాఫలం మొక్కలను మహరాష్ట్రలోని షోలాపూర్ నుంచి దిగుమతి చేసుకున్నారు. ఎస్ఎంకే గోల్డ్న్ వెరైటీ సీతాఫలం ఎకరాకు 450 మొక్కలు, సాగుకు రూ. 2లక్షల నుంచి రూ. 2. 5 లక్షలు పెట్టుబడి పెట్టాలి. ఈ పంట సాగు చేస్తే రెండేళ్లలోనే దిగుబడులు వస్తాయి. సీతాఫలం చెట్లు కాలపరిమితి 25 నుంచి 30 ఏళ్లు. తోటలు సాగు వ్యవసాయ సాగు పద్ధతులు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పంట సాగుతో నీటి ఆదా జరుగుతుందన్నారు. ఏటా నికర ఆదాయం వచ్చే పంటతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని వెల్లడించారు. ఎలాంటి భూముల్లో అయినా ఈ పంటలు సాగు చేయవచ్చు. ఈ ఫలం తినడం వల్ల కంటికి మంచిది. రక్తహీనత నివారిస్తుంది. శరీర రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. క్యాన్సర్ కణాలను నాశనం చేస్తాయని వైద్య నిపుణులు చెపుతున్నారు. సీతాఫలం నాణ్యత బట్టి మార్కెట్‌లో కిలో ధర రూ. 100 నుంచి రూ 120 పలుకుతోందన్నారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో వ్యాపారులు నేరుగా తోటల వద్దకు వచ్చి పంట దిగుబడులు కొనుగోలు చేస్తున్నారు. సీతాఫలం తోటలు సాగు చేసుకోవడానికి మన రైతులు దృష్టి సారిస్తే లాభాలు పొందవచ్చని రైతు తెలిపారు.


తోటలో కాసిన సీతాఫలం

మహానగరాల్లో మంచి డిమాండ్

హైదరాబాద్, ఢిల్లీ వంటి నగరాల్లో మన సీతాఫలానికి మంచి డిమాండ్ ఉంది. మార్కెటింగ్ చేసుకోవడానికి అవగాహన అవసరం. సీతాఫలం తోటలు సాగు చేసుకుంటే లాభ దాయక పంట. ఏటా నికర ఆదాయం వస్తుంది.

షేక్ అబ్దుల్లా, కలిచెర్ల రైతు, పెద్దమండ్యం మండలం

ఎగుమతులకు సిద్ధంగా...



సబ్సిడీలు పొందాలంటే.. ఎన్‌పీసీఐ తప్పనిసరి

- లేదంటే సబ్సిడీలు రావంటూ అధికారుల హెచ్చరికలు
- పోస్టాఫీసుల్లో నమోదు చేస్తున్న ఉద్యోగులు


పోస్టాఫీస్ వద్ద ఎన్‌పీసీఐ నమోదు చేస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాల నుంచి సంక్షేమ ఫలాల సబ్సిడీ మొత్తాన్ని పొందాలంటే నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) లింకింగ్ తప్పనిసరిగా చేయించుకోవాల్సిందేనని అధికారులు పేర్కొంటున్నారు. లేదంటే సబ్సిడీలు రాకపోవచ్చని హెచ్చరిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే అన్ని రకాల సబ్సిడీలు పొందాలంటే తప్పనిసరిగా లింకు చేయించుకోవాల్సిందేనని తెగేసి చెబుతున్నారు. ఆధార్, పాన్ కార్డులు బ్యాంకుకు లేదా ఎన్‌పీసీఐకి తప్పనిసరిగా లింక్ కావాల్సిందేనని తేల్చి చెబుతున్నారు. ఇందుకు సంబంధించి పోస్టల్ ఉద్యోగులు లింక్ చేసేందుకు అర్హుల నుంచి తంబింగ్ ప్రాసెస్ భారీగా చేస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన దీపం-2 పథకానికి ఇప్పటి వరకు చాలా మందికి సబ్సిడీ పడక పోవడంతో లబ్ధిదారులు ఈ లింక్ చేయించుకునేందుకు పరుగులు తీస్తున్నారు. దీనికి తోడు త్వరలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయ బోయే మాతృవందనం కోసం విద్యార్థుల తల్లిదండ్రులు ఈ లింకింగ్ కోసం పడిగాపులు కాస్తున్నారు. అయితే అధికారులు పబ్లిసిటీ ఇవ్వ కపోవడంతో చాలా మందికి తెలియడం లేదు. ఈ లింకింగ్ కోసం రూ.200 రుసుం చెల్లించాల్సి వుంటుంది.



సబ్సిడీలు ఖాతాల్లో జమకావాలంటే...

పీఎం కిసాన్, అన్ని రకాల పెన్షన్లు, స్కాలర్‌షిప్, ఎల్‌పీజీ గ్యాస్, ఎరువుల సబ్సిడీ, మాతృవందనం, ఎంఎస్‌ఆర్‌ఈజీఏ ఇలా అన్ని రకాల సబ్సిడీలు వారి ఖాతాల్లో జమకావాలంటే తప్పనిసరిగా లింక్ చేసుకోవాల్సిందేనని అధికారులు అంటున్నారు. ఇందు కోసం స్థానిక పోస్టాఫీసు వద్ద తుమ్మలపల్లె, వలసపల్లె, జువారి బ్రాంచ్ పోస్ట్ మాస్టర్స్ వచ్చిన వారికి లింకింగ్ ప్రాసెస్ చేస్తున్నారు.

భవిష్యత్తులో అన్ని పోస్టాఫీసులే..

రానున్న రోజుల్లో అన్ని రకాల సేవలు పోస్టాఫీసు నుంచే చేయనున్నట్లు తెలుస్తోంది. ఇకపై గ్రామాల నుంచి డబ్బు కోసం బ్యాంకులకు రాకుండా ప్రతి పల్లెలో పోస్టు బ్యాంకును ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. అందరికీ అందుబాటులో ఉండేలా, సులభ తరంగా నేరుగా డబ్బు తీసుకునేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం తన అధీనంలో ఉన్న పోస్టాఫీసులను వినియోగిస్తున్నట్లు భావిస్తున్నారు. ఒకవిధంగా చెప్పాలంటే అన్ని రకాల సబ్సిడీలు కేంద్ర ప్రభుత్వ అధీనంలోనే ఉండే విధంగా ఈకార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేసే ప్రయత్నంలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందుకు తగ్గట్టుగానే ఎన్‌పీసీఐకి లింక్ తప్పనిసరి చేస్తున్నారు.

సచివాలయ సిబ్బందిని పోస్టల్ వారితో లింక్‌చేశాం

ఎన్‌పీసీఐకి లింక్‌కాని వారి లిస్టు కలెక్టర్ కార్యాలయం నుంచి మాకు వచ్చింది. సుమారు మూడువేలకు పైబడి మంది బ్యాంకుకు, లేదా పోస్టల్ అకౌంట్‌కు లింక్ కాని వారు ఉన్నారు. వారందరి ఆధార్, పాన్ కార్డులను ఎన్‌పీసీఐకి లింక్ చేసేందుకు చర్యలు తీసు కుంటున్నారు. ఇందులో భాగంగా సచివాలయ సిబ్బందిని పోస్టా ఫీసు సిబ్బందితో సమన్వయం చేసుకుంటున్నారు. ఇప్పటికే ఆధార్ అకౌంట్‌కు లింక్ అయినవారికి అవసరం లేదు.

-శేషఫణి, కమిషనర్, ఎర్రగుంట్ల

జాతీయ స్థాయి అండర్-17 అథ్లెటిక్స్‌కు కడప విద్యార్థిని శ్రీలతారెడ్డి


శ్రీలతారెడ్డిని అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం షర్మిలారాణి

కడప స్పోర్ట్స్ నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఎం.శ్రీలతారెడ్డి 68వ జాతీయ స్థాయి అండర్-17 అథ్లెటిక్స్‌కు పోటీలకు ఎంపికైంది. గత కొన్ని సంవత్సరాలుగా శ్రీలతారెడ్డి పలు క్రీడా పోటీలలో పాల్గొంటూ పలు పథకాలు సాధిం చింది. ఆ మేరకు ఈనెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొని 400 మీటర్ల రన్నింగ్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించింది. దీంతో ఈ నెల 26 నుంచి 30 వరకు లక్నోలో జరుగనున్న జాతీయస్థాయి పోటీలలో పాల్గొననుంది. శుక్రవారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు షర్మిలారాణి, పాఠశాల పీఈటీ మంజులత, ఉపాధ్యాయులు శ్రీలతారెడ్డిని అభినందారు.

జిల్లా స్థాయి త్రోబాల్ పోటీలకు నీలకంట్రావుపేట విద్యార్థులు ఎంపిక



రామాపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో నిర్వహించే త్రోబాల్ పోటీలకు నీలకంట్రావుపేట జిల్లా పరిషత్ హైస్కూల్ (తెలుగు) విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ముక్కవారిపల్లె ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి త్రోబాల్ పోటీల్లో నీలకంఠ్రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు) విద్యార్థులు అండర్-14 విభాగంలో జి.నాగచైతన్య, కె.పవనేశ్, బాబు, స్టాండ్‌బైగా వెంక టరామయ్య, అండర్-17 విభాగంలో హర్షవర్ధన్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ప్రధానోపాధ్యాయులు సుజాతమ్మ, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. పీడీ నరేంద్రకుమార్‌రెడ్డిని అభినందించారు.

రైతులకు అందుబాటులో అగ్రిల్యాబ్

- జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీడీఏ మల్లికార్జున

కమలాపురం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులకు అందుబాటులో అగ్రిల్యాబ్‌ను ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం కమలాపురం అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలోని అగ్రి టెస్టింగ్ ల్యాబ్ వ్యవసాయాధికారులకు మరియు వ్యవసాయ విస్తరణాధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అగ్రిల్యాబ్‌లో ఉన్న సేవలను ఉపయోగించుకోవాలన్నారు. ప్రతి రైతు విత్తనాలు, ఎరువులు పరీక్షలను ఉచితంగా చేయించుకోవచ్చన్నారు. పరీక్షల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు పంటలకు ఎలా ఉపయోగించాలనే విషయాలను తెలుసుకోవచ్చన్నారు. డీడీఏ మల్లికార్జున అగ్రిల్యాబ్‌లోని వివిధ రకాల పరికరాలను వాడే విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ నరసింహారెడ్డి, కిరణ్‌కుమార్, వెంకటేశ్వరరెడ్డి, పులివెందుల, ప్రొద్దుటూరు, బద్వేలు, ముద్దనూరు, కమలాపురం, రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి, మదనపల్లె, తంబళ్లపల్లె అగ్రిల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సకాలంలో అందాలి : కలెక్టర్


డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కలసపాడు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు సకాలంలో అందేలా చూడాలని సచివాలయ ఉద్యోగులను కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలోని తెల్లపాడు పంచాయతీలలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయన ఉద్యానవన పంటలను, చెరువులను, లిఫ్ట్‌ఇరిగేషన్, డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి అనుసంధానంగా ఉద్యోగులు పనిచేయాలన్నారు. ఉద్యానవన పంటలు సాగుచేస్తే దిగుబడులు ఎలా వస్తాయని రైతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే డ్వాక్రా మహిళలు ఎవరైన లోన్లు తీసుకని అభివృద్ధి చెందితే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయన్నారు. అలాగే ఉపాధిహామీ పథకం ద్వారా సరైన సమయంలో పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం తెల్లపాడు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు అదనపు గదులు, అటెండరు మంజూరు చేయాలని వారు కలెక్టర్‌ను కోరారు. అనంతరం జిల్లా ఉన్నతాధికారులతో పరిశీలించిన విషయాలపై ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పాల్గొన్నారు.

వైవీయూ, కేరళ క్రైస్ట్ కళాశాల మధ్య ఎంఓయూ


ఎంఓయూ ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న కళాశాలల ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైవీయూ ఎర్త్‌సైన్స్ విభాగం, కేరళలోని క్రైస్ట్ కళాశాల జియాలజీ అండ్ ఎన్విరాన్మెంటల్ సైన్స్ విభాగం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. వీసీ క్రిష్ణారెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ పద్మ, ఎర్త్‌సైన్స్ హెచ్‌ఓడీ తుమ్మలకుంట శివ, లక్ష్మీప్రసాద్, క్రైస్ట్ కాలేజీ ప్రొఫెసర్ లింటో, డాక్టర్ రేష్మ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అకడమిక్‌గా, పరిశోధనాపరంగా పరస్పర ప్రయోజనాల కోసం ఈ ఎంఓయూ కుదుర్చుకున్నట్లు వారు తెలిపారు.

లైంగిక దాడి కేసులో 20 ఏళ్ల జైలు

నెల్లూరు (లీగల్), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : లారీలో ప్రయాణిస్తున్న బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న కేసులో నేరం రుజువు కావడంతో కడప జిల్లా పోరుమామిళ్లకు చెందిన పప్పర్తి సుబ్బారాయుడు అనే నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.22వేల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. 2020 మే 19వ తేదీ రాత్రి అత్మకూరు సమీపంలో బాలిక, ఆమె మావయ్య సుబ్బారాయుడు లారీ ఎక్కారు. సంగం వద్ద టిఫిన్ సాకుతో బాలిక మావయ్యను లారీ నుంచి దించిన నిందితుడు ఆ తర్వాత బాలికను తీసుకుని లారీలో కృష్ణపట్నం వైపు వేగంగా వెళ్లాడు. ఆ తర్వాత బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదుతో సంగం పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఐదు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



పెండ్లిమర్రి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుద్ధాయపల్లె వద్ద గల పాపాఘ్ని నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మధుసూధన్‌రెడ్డి తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం రావడంతో రెవెన్యూ సిబ్బంది పోలీసులతో కలిసి దాడులు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. పక్కనే ప్రభుత్వ ఇసుక క్వారీ ఉండడం, ఆ ఇసుక క్వారీ పక్కనే అనధికారకంగా ఇసుకను ట్రాక్టర్లతో తరలిస్తున్నారని సమాచారం రావడంతో రెవెన్యూ సిబ్బంది, పోలీసులతో కలిసి అక్కడకు వెళ్లి ట్రాక్టర్లను పట్టుకొని అప్పజెప్పినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎర్రచందనం కేసులో ఐదేళ్లు...

బద్వేలు రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో పట్టుబడిన నిందితుడు యాతగిరి వీరభాస్కర్‌కు తిరుపతి రెడ్‌శాండిల్ స్పెషల్‌ఫోర్స్ జడ్జి ఐదేళ్ల జైలు శిక్ష విధించారు. ఎఫ్‌ఆర్‌ఓ నయీం అలీ వివరాల మేరకు... 2018వ సంవత్సరంలో లోతువంక బీట్ పరిధిలో అటవీ అధికారులు దాడులు నిర్వహించి.. అక్రమంగా ఎర్రచందనం దుంగలు తరలిస్తున్న వీరభాస్కర్‌ను అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 126 కేజీల బరువు గల 5 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఇతను సిద్దవటం మండలం వెంకటాయపల్లె గ్రామానికి చెందిన వ్యక్తి. ఈ కేసుకు సంబంధించి తిరుపతి రెడ్ శాండిల్ స్పెషల్‌కోర్టు జడ్జి విచారణ జరిపి నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6లక్షల జరిమానాను విధిస్తూ తీర్పు ఇచ్చారు. జరిమానాను చెల్లించని పక్షంలో మరో 6నెలల జైలు శిక్షను అదనంగా విధించినట్లు ఎఫ్‌ఆర్‌ఓ తెలిపారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు



చక్రాయపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలపల్లెలో గత నెల అక్టోబరు 26వ తేదీ జరిగిన చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ నాగరాజు విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మాలపల్లెలో యల్లమ్మ అనే మహిళ ఇంట్లో రూ.4.90 లక్షల విలువైన 160 గ్రాముల బంగారు, 90 గ్రాముల వెండి, రూ.7500నగదు దొంగతనం చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా వైదుకూరు మండలం అన్నలూరు గ్రామానికి చెందిన సుబ్బరాయుడు అనే వ్యక్తి చోరీకి పాల్పడినట్లు తేలిందన్నారు. సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం అతని ఇంటి వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. ముద్దాయి అత్తారిల్లు అయిన చిలేకాంపల్లె మాలపల్లె గ్రామానికి వచ్చి తన అత్త చెల్లెలు అయిన యల్లమ్మ ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగతనం చేసినట్లు పంచాయతీదారుల సమక్షంలో ఒప్పుకొని సొత్తు, నగదు చూపడం జరిగిందన్నారు. నిందితుని అరెస్టు చేసి సొత్తును రికవరీచేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

వార్డెన్‌ను బ్లాక్‌మెయిల్ చేసిన విద్యార్థి సంఘం నాయకుడి అరెస్టు

ముద్దనూరు నవంబరు22 (ఆంధ్రజ్యోతి): బ్లాక్‌మెయిల్ కేసులో రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్ (ఆర్‌ఎస్‌ఓ) నాయకుడు తోల్ల జగన్‌ను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ దస్తగిరి తెలిపారు.

ముద్దనూరులోని ఎస్సీ బాలుర వసతి గృహం వార్డన్ మనోహర్‌ను విద్యార్థి సంఘం నాయకుడు జగన్ డబ్బులు డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోతే ఉద్యోగం పోయేలా చేస్తామని బెదిరించి, మానసిక వేధింపులకు గురిచేశాడు. వార్డన్ ఫిర్యాదు మేరకు జగన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

'బీసీ కుల జనగణన చేపట్టాలి'


సమావేశంలో మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు

కడప మారుతీనగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బీసీ కులాలకు సంబంధించి కుల జనగణన చేపట్టాలని బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర చైర్మన్ పూర్ణచంద్రరావు, రాష్ట్ర కన్వీనర్ బీసీ రమణ, కో-కన్వీనర్ రెడ్డిబాబు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా శుక్రవారం కడప ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం రాక ముందు నాటి బ్రిటీష్ ప్రభుత్వం గత 1931లో బీసీ కుల జనగణన చేపట్టిందన్నారు. నాటి నుంచి నేటి వరకు పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా బీసీ వర్గాల కుల జనగణన చేపట్టడంలో నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు. ఎన్నికలప్పుడు నా బీసీలు అనే పలు పార్టీల నాయకులు అధికారంలోకి రాగానే బీసీల గురించి మరచిపోతున్నారని ఎద్దేవా చేశారు. ఇటీవల పశువులతో పాటు కుక్కలు, కోళ్ల గణన చేసిన పాలకులకు బీసీ కుల గణన చేయకపోవడంలోని అంతర్యమేమిటని ప్రశ్నించారు. పక్క రాష్ట్రమైన తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అక్కడ బీసీల కుల జనగణన చేపడుతున్న సంగతి తెలిసిందేనన్నారు. అలాగే మన రాష్ట్రంలో కూడా చేపట్టాలన్నారు. చట్ట సభల్లో బీసీ వర్గాలకు జనాభా దామాష ప్రకారం అందాల్సిన రాజకీయ రిజర్వేషన్‌లు అందలేదన్నారు. బీసీ వర్గాల పిల్లలకు సరైన రీతిలో విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాలు దక్కాలంటే బీసీల జనాభా ఎంత శాతం ఉందనే విషయం బహిర్గతం కావాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ వర్గాల ప్రజలు జాగృతమై పాలక ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశ అనంతరం బీసీ జిల్లా సమన్వయ కమిటీ నూతన ఎన్నిక నిర్వహించారు. జిల్లా చైర్మన్‌గా శివరామాచారి, కన్వీనర్‌గా కృష్ణకిరీటి, ప్రధాన కార్యదర్శిగా మణికుమార్, కో-కన్వీనర్లుగా వివేకానంద, చిన్న ఎన్నికయ్యారు.

దుర్వాసన వస్తున్న కేక్ అమ్మకం

- కొనుగోలుదారుడి ఫిర్యాదు
- రూ.5 వేలు జరిమానా

బద్వేలుటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నాలుగురోడ్ల కూడలిలో ఓ బేకరిలో దుర్వాసన వెదజల్లే కేక్‌లను విక్రయిస్తున్నారని ఓ వ్యక్తి మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఆ వ్యక్తి మధ్యాహ్నం బేకరికి వెళ్లి కేక్‌ను కొనుగోలు చేసి ఇంటికి తీసుకువెళ్లాడు. తినేందుకు బాక్స్ ఓపెన్ చేయగా దుర్వాసన రావడంతో వెంటనే బేకరివద్దకు వచ్చి వారిని ప్రశ్నించారు. ఎప్పుడో తయారు చేసిన కేకులను ఎందుకు విక్రయిస్తున్నారని వాగ్వాదానికి దిగాడు. ఆ వెంటనే మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన మున్సిపల్ అధికారులు బేకరిని తనిఖీచేసి కేక్‌ను పరిశీలించగా దుర్వాసన వస్తుండటంతో రూ.5వేలు జరిమానా విధించారు. మరోమారు ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉపాధ్యాయులకు మెమోలు జారీ

కమలాపురం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కమలాపురం గురుకుల పాఠశాలలోని ఇద్దరు ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేసినట్లు ప్రిన్సిపల్ తులశమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత రెండు రోజులుగా పాఠశాలలో జరుగుతున్న పరిణామాలకు సంబంధించి పత్రికలో వస్తున్న కథనాలకు సంబంధించి కారణమైన ఇద్దరు ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేశామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అవసరమైన రైతులకు బిందు, తుంపర పరికరాలు ఇవ్వాలి


బిందుసేద్యంపై రైతులకు సూచనలు ఇస్తున్న జిల్లా అధికారి లక్ష్మీదేవి

రాజంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బిందు, తుంపర సేద్య పరికరాలు అవసరమైన ప్రతి రైతుకు అందించాలని .జిల్లా సూక్ష్మ నీటిసాగు అధికారి వై.లక్ష్మీదేవి తెలిపారు. శుక్రవారం బిందు, తుంపర సేద్యం పరిక రాలు, ప్రాథమిక సర్వేలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆకేపాడులో ఏర్పా టు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు సూక్ష్మ నీటి సేద్య పరికరాలను 30,950 హెక్టార్లకు సరఫరా చేయాల్సి ఉండగా 28,950 హెక్టార్లకు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్నారన్నారు. ఇప్పటి వరకు 5445 హెక్టార్లకు జిల్లా పాలనాధికారి ఆమోదంతో మంజూరు ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఐదెకరాల్లో లోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే 5 నుంచి 10 ఎకరాల భూమి ఉన్నవారికి 70 శాతం రాయితీతో బిందుసేద్య పరికరాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

రైతుసేవా కేంద్రాల్లో పనిచేసే గ్రామ ఉద్యాన వ్యవసాయ, పట్టుప రిశ్రమ సహాయకులు, ఎంపీఈవోలు బిందు, సేద్య పరికరాలు కోసం నమోదు చేసుకున్న రైతుల పొలాలను వెంటనే సందర్శించి ప్రాథ మిక సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాజంపేట ఉద్యాన అధికారి జి.సురేష్‌బాబు, ఎంపీడీసీ చంద్ర, ఎంఐ ఇంజనీర్ గురుప్రసాద్, ఎంఐఏవో నజీర్, రాజంపేట, నందలూరు, పెనగలూరు రైతుసేవా కేంద్రాల సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

దళితుల ఇంటి పట్టాలపై రీ సర్వే చేయండి

రైల్వేకోడూరు, నవంబరు 22.(ఆంధ్రజ్యోతి) దళితుల ఇంటి పట్టాలపై రీ సర్వే చేయాలని రాష్ట్ర టీడీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్ రైల్వేకోడూరు తహసీల్దార్ మహబూబ్ చాంద్‌ను కోరారు. శుక్రవారం రైల్వేకోడూరు తహసీల్దార్ కార్యాలయంలో దళితుల సమస్యలపై ఆయన తహసీల్దార్‌తో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో దళితులకు ఇచ్చిన పట్టాలకు సంబంధించి రీ సర్వే చేయించాలని కోరారు. మండలంలోని ఉర్లగట్టుపోడు, సమతానగర్‌కు చెందిన దళితుల ఇంటి పట్టాల సమస్యలను పరిష్కరించాలన్నారు. కూటమి ప్రభుత్వంలో దళితులకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు. రైల్వే కోడూరు ప్రాంతంలో వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో ఆక్రమణలు జరిగాయని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో వైసీపీ ద్వారా జరిగిన అన్యాయాలపై న్యాయం జరిగేలా అధికారులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవా కార్యకర్త మందపాటి శంకరయ్య, టీడీపీ యువ నాయకులు కస్తూరి దినేష్, బిగురుపాటి శంకర్, కే. బుడుగుంటపల్లె, ఉర్లగట్టుపోడు తదితర గ్రామాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు, దళితులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌తో చర్చిస్తున్న పంతగాని

పక్కా గృహాలకు దరఖాస్తు చేసుకోవాలి

పెనగలూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అర్హులైనవారు పక్కా గృహాలకు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ కార్పొరేషన్ ఏఈ హరిప్రసాద్ తెలిపారు. 3 సెంట్లు సొంత జాగా కలిగి ఉండి రేషన్‌కార్డులో ఉన్న మహిళలు అర్హులన్నారు. పక్కాగృహాలు కావాల్సినవారు దరఖాస్తుతో పాటు రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టుసైజు ఫొటో గ్రామ సచివాలయం, మండల పరిషత్ కార్యాలయంలో కానీ, హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయాల్లో గానీ అందజేయాలని ఆయన తెలియజేశారు.

వెండి శఠగోపం అందజేత

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా పట్టణంలోని సర్వమంగళ, రామలింగేశ్వరస్వామి ఆలయానికి న్యాయవాది ఎంఎల్ రామచంద్రారెడ్డి దంపతులు , కుమారుడు చైతన్యరెడ్డి శుక్రవారం రూ. 50 వేలు విలువచేసే శఠగోపాన్ని అందజేశారు.ఆలయ ధర్మకర్తలు మోహన్ రెడ్డి, భూదేవమ్మ, ప్రధాన అర్చకుడు హరిశర్మ స్వీకరించారు. ఈ సందర్భంగా వారు పూజలు నిర్వహించారు.

అనారోగ్యంతో లాయర్ సుబ్బరామిరెడ్డి మృతి



రాజంపేట టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రముఖ న్యాయవాది, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కటారు సుబ్బరామిరెడ్డి శుక్రవారం హైదరాబాదులో మృతి చెందారు. కొన్ని రోజులుగా కూతురు పావని వద్ద ఉంటూ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న ఆయన అనారోగ్యంతో మృతిచెందారు. గతంలో ఆయన రాజంపేట సింగిల్‌విండో అధ్యక్షుడుగా పని చేశారు. ఆయన మృతికి పలువురు నేతలు సంతాపం ప్రకటించారు.

సీతారాముల కల్యాణం

గాలివీడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాతిరెడ్డిగారిపల్లె సమీపంలోని ఆలయాల సముదాయంలో శుక్రవారం సీతారాముల కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

మల్లూరమ్మకు పూజలు

చిన్నమండెం, నవంబరు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీలో శుక్రవారం ఉదయం మల్లూరమ్మకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఉద్యాన పట్టాకు ప్రపంచ వ్యాప్తంగా అవకాశాలు

రైల్వేకోడూరు, నవంబరు 22.(ఆంధ్రజ్యోతి) ఉద్యాన పట్టాకు ప్రపంచ వ్యాప్తంగా అవకాశాలు ఉన్నాయని ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్‌వీ సురేష్‌కుమార్, ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ పీటీ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘం ఎన్నికలకు కసరత్తు

సంబేపల్లె, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిపల్లె పెద్దచెరువు, రేకులకుంటచెరువుల సాగు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటేశులు, ఇరిగేషన్ శాఖ ఏఈఈ శివనాయక్ శుక్రవారం తెలిపారు. ఇందుకు సంబంధించిన ఓటరు జాబితాపై కసరత్తు ప్రారంభించారు. డిసెంబరు 5న ఈ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. డిసెంబరు 8న నీటి సంఘం ఎన్నికలు జరగనున్నాయి. శెట్టిపల్లె పెద్దచెరువుకు సంబంధించి 144 మంది ఓటర్లుండగా ఇందులో పురుషులు 103, మహిళలు 41 మంది, రేకులకుంట చెరువు సంబంధించి 107 మందికి గానూ పురుషులు 62 మంది, మహిళలు 45 మంది ఉన్నట్లు తెలిపారు. డిసెంబర్‌లో ఎన్నికలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ స్రవంతి, వీఆర్‌వో శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి

వీరబల్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక పథకం దుర్వినియోగమవుతోందని, కొంతమంది రేయింబవళ్లు ఇసుకను దూర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని శుక్రవారం వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి ఎంపీడీవో కార్యాలయంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఇసుక తరలింపుతో భూగర్భజలాలు అడుగంటి మాండవ్యనదికి ఇరువైపులా ఉన్న రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇప్పటికే యాభై శాతం వరకు ఇసుక తరలిపోయిందని తెలిపారు. రైతుల పొలాల కింద, వాటర్ స్కీమ్ బోర్ల వద్ద తవ్వకుండా చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన అవసరం

రాజంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రహదారి భద్రతపై అందరికీ అవగాహన అవసరమని ఆర్టీవో బి. వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పురుషోత్తం ఆధ్వర్యంలో రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్టీవో మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వాహనాలపై వెళ్లేటప్పుడు సెల్‌ఫోన్లను వినియోగించకూడదన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కె.వెంకటనరసయ్య మాట్లాడుతూ వాహనాలను క్రాస్ చేసే సందర్భంలో ఎదురుగా వచ్చే వాహనాలను కూడా గమనించాలన్నారు.

ప్రతి గ్రామంలో రోడ్లు.. టీడీపీ లక్ష్యం

చిన్నమండెం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వండాడి గ్రామం గొర్లముడి వేడు నుంచి తూర్పుపల్లె వరకు కోటి రూపాయలపైన నిధులతో దాదాపు 1.65 కిలోమీటర్లు బీటీ రోడ్డు నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. శుక్రవారం టీడీపీ యువ నాయకుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చి ఇప్పటికి కొద్ది నెలలైనా నియోజకవర్గంలో ప్రతి మండలంలో దాదాపుగా రూ. రెండు కోట్లకు పైగా విలువైన సిమెంటు రోడ్లు నిర్మించామన్నారు. ఇప్పుడు ప్రతి మండలంలో దాదాపుగా మూడు నుంచి నాలుగు కోట్లకుపైగా విలువైన మట్టి రోడ్లు నిర్మించనున్నామన్నారు. భవిష్యత్తులో కూడా నియోజకవర్గంలో మారుమూల గ్రామాలకు సైతం సిమెంటు రోడ్డు, మట్టి రోడ్డు ఏర్పాటు చేసి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

సర్వే రాళ్లపై చిత్రాల తొలగింపు.. సబ్ కలెక్టర్ పరిశీలన


ఓబులవారిపల్లె, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిన్నంపల్లె, వెంకటేశ్వరపురం ఎస్టీ కాలనీలో సర్వేరాళ్లపై ఉన్న చిత్రాలను తొలగించే కార్యక్రమాన్ని రాజంపేట సబ్‌కలెక్టర్ నిధియాదేవి శుక్రవారం పరిశీలించారు. మండల కేంద్రంలో భూ సమస్యలు, ఇనాం భూములకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. రికార్డుల సక్రమంగా నిర్వహించాలని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల తనిఖీ

సిద్దవటం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆరోగ్య కేంద్రాలను శుక్రవారం జోనల్ మలేరియా అధికారి లక్ష్మీనారాయణనాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీటక జనిత వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని మలేరియా, టైఫాయిడ్ జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ జాగ్రత్తలు పాటించేలా చూడాలని తెలియజేశారు. దోమ కాటుతో బోదకాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, రాత్రివేళల్లో దోమలు కుట్టకుండా ప్రతిఒక్కరు దోమతెరలు వాడాలని, పల్లె ప్రాంతాల్లో వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండి లార్వా వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ త్యాగరాజు, మలేరియా అధికారి మనోరమ, సబ్‌యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు, డాక్టర్ ప్రకాష్, శివకుమార్, ఎంపీహెచ్‌వోలు, నిత్యపూజయ్య, తదితర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో బోర్డు తొలగింపు

- చోద్యం చూస్తున్న రెవెన్యూ సిబ్బంది



తొలగించిన హెచ్చరిక బోర్డు

సిద్దవటం, నవంబరు 22 (ఆంధ్ర జ్యోతి):మండలంలోని కడప - చెన్నై రహదారిలోని కనుమలోపల్లె వద్ద రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు తొలగించి ప్రభుత్వ భూమి చదును చేసినా రెవెన్యూ సిబ్బంది అటువైపు కన్నెత్తి చూడలేదని విమర్శలు వెలువడుతున్నాయి. కనుమలోపల్లె గ్రామంలోని సర్వే నంబరు 70/3లోని 70 సెంట్ల ప్రభుత్వ భూమి ఆన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కొంతమంది ఆ స్థలాన్ని చదును చేసి, రెవెన్యూ సిబ్బంది అమర్చిన హెచ్చరిక బోర్డు తొలగించారు. ఈ విషయంపై మండల ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలతను వివరణ కోరగా తొలగించిన హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తామని, సర్వే నంబరు 70/3లో ఎటువంటి పనులు చేయకూడదని, అది ప్రభుత్వస్థలమని ఆమె అన్నారు.

'అక్రమంగా దత్తత' నేరం

చిన్నమండెం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): స్త్రీకి మాతృత్వం ఒక వరం అని.. లేని పక్షంలో దత్తత అందుకు మరో మార్గమని శిశు గృహ మేనేజర్ సుప్రియ అన్నారు. అంతర్జాతీయ దత్తత దినం సందర్భంగా చిన్నమండెం మండల సమాఖ్య నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతి స్త్రీ తల్లి కావాలని ఆశిస్తుందని, ఆ అవకాశం లేని పరిస్థితుల్లో దత్తత ద్వారా ఆ కోరిక నెరవేర్చుకోవచ్చన్నారు. అక్రమంగా దత్తత ఇవ్వడం, తీసుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. దత్తత ముఖ్య ఉద్దేశం పిల్లలు లేని తల్లిదండ్రులకు ప్రేమ పంచే కుటుంబాన్ని ఏర్పాటు చేయడమన్నారు. దత్తత తీసుకునే వారి కోసం ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనల పత్రాలను సమావేశంలో పంచిపెట్టారు. ఎటువంటి సమస్యలున్నా 1098 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చునని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో శిశు గృహ సోషల్ వర్కర్ గాయత్రి, ఏపీఎం రెడ్డెమ్మ, సీసీలు, వీవోలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థ పదార్థాల నిర్వహణపై సర్వే



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సంబేపల్లె, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వ్యర్థ పదార్థాల నిర్వహణ, ఇంకుడు గుంతల ఏర్పాటుపై ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు సంబేపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. ఈ అంశాలపై విద్యార్థులు ఇంటింటి సర్వే నిర్వహించారన్నారు. ఈ సర్వేలో ప్రతిభ చూపిన విద్యార్థులకు క్రీడా, విద్యాసంబంధ బహుమతులు అందించారన్నారు. బహుమతులు పొందిన వారిలో సీనియర్ విభాగంలో 9వ తరగతి మానస, పవన్ గణేశ్, 8వ తరగతి మౌనిక, జూనియర్ విభాగంలో 6వ తరగతి తేజస్విని, రెడ్డిమనస్విని, 7వ తరగతి ఫజిల్ ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ ప్రతినిధి లక్ష్మయ్య, పాఠశాల కోఆర్డినేటర్ రెడ్డిశేఖర్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, విజయభాస్కర్, దేవ ప్రసాద్‌రెడ్డి, రామయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 35 మందికి ఉద్యోగాలు

రాయచోటిటౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మోడెం చిన్నప్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 35 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. రాయచోటి పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, తొగటవీరక్షత్రియ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోడెం వీరాంజనేయప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్‌మేళాకు 157 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ప్రతి నెల నిర్వహించనున్న ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకొని ఉద్యోగ అవకాశాలు పొందాలని నిర్వాహకులు సూచించారు. మరింత సమాచారం కోసం 9652285027 అనే నెంబరును సంప్రదించాలన్నారు. .

గంగమ్మకు పూజలు

రైల్వేకోడూరు, నవంబరు 22: గంగమ్మ ఆలయ 4వ వార్షికోత్సవం సందర్భంగా కొత్త కోడూరులో శుక్రవారం మహిళలు 108 కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి వచ్చి హోమాలు చేయించారు. ఈ సందర్భంగా గంగమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకుడు జగత్పతి పాల్గొన్నారు.

రైతు సంఘాల ర్యాలీని జయప్రదం చేయండి

రాజంపేట టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కార్మిక, ఉద్యోగ, కర్షకుల విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 26న ఆల్ ట్రేడ్ యూనియన్స్, అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ ర్యాలీ, బహిరంగ సభను జయప్రదం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సి.రవికుమార్ మాట్లాడుతూ దేశంలో మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ కార్పొరేటర్లకు ఊడిగం చేస్తున్నదని ఆరోపించారు. అందుకే 15 లక్షల కోట్ల రూపాయలు రుణమాఫీ చేశారని తెలిపారు. కార్మికులకు నష్టం తెచ్చే నాలుగు లేబర్ కోడ్‌లు తెస్తున్నదని, వ్యవసాయ రంగంలో మూడు నల్ల చట్టాలను రైతులు సంవత్సరం పాటు పోరాడి రద్దు చేయాలన్నా చేయలేదన్నారు. ధరలు 300 రెట్లు పెరిగినా కార్మికులకు కనీస వేతనం 26 వేలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. రైతుల ఆత్మహత్యలు నివారించాలని, ఉపాధి పథకం పటిష్టంగా అమలు చేయాలని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణలోకి ఆపాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు రక్షణకై పాటు పడాలని కోరారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని కోరారు. మహిళల రక్షణకై ప్రత్యేక చట్టాలు అమలు పరచాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని కార్మికులు, ఉద్యోగులు, ప్రజలను సమీకరించి ఐక్య ఉద్యమాలతో కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలను ప్రతిఘటిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.మణి, మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి రమణ, రైతు సంఘం జిల్లా నాయకులు హరిప్రసాద్, అంగన్వాడీ నాయకురాలు ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్పెట్ల పంపిణీ

పుల్లంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ బాలుర కేంద్రీకృత వసతి గృహం, బాలికల వసతిగృహ విద్యార్థులకు శుక్రవారం ఏఎస్‌డబ్ల్యూ శ్రీనివాసమూర్తి శుక్రవారం కార్పెట్లను పంపిణీ చేశారు. చలి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నియోజకవర్గాని 930 కార్పెట్లను పంపిణీ చేసిందన్నారు. పుల్లంపేట మండలంలో 230 మంది విద్యార్థులకు కార్పెట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఏఎస్‌డబ్ల్యూవో తిరుపతి రెడ్డి సుబ్బరాజు, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్, వార్డు సెక్రటరీని సస్పెండ్ చేయాలి

రాయచోటిటౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అక్రమాలకు పాల్పడుతున్న రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, 24వ వార్డు సచివాలయ సెక్రటరీ రాంమోహన్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు బుక్కే విశ్వనాథ నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన సీపీఐ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంతో ఎటువంటి సంబంధం లేకపోయినా, వార్డు సచివాలయ ఉద్యోగి రాంమోహన్‌రెడ్డి మున్సిపల్ కార్యాలయంలో చక్రం తిప్పుతుంటే కమిషనర్ వాసుబాబు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను హెల్త్ ఇన్‌స్పెక్టర్‌గా డిమోట్ చేయడంతోపాటు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టును సచివాలయ ఉద్యోగికి ఏ విధంగా కేటాయిస్తారని నిలదీశారు. ఆటో సూపర్ వైజర్‌ను విధులకు రానీయకుండా చేయడంతో పాటు ఆటోల నిర్వహణ పేరుతో మూడు నెలల వ్యవధిలో సుమారు రూ.20 లక్షలకు బిల్లులు పెటుకున్నారన్నారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్ ఆఫీసర్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుధీర్‌కుమార్, లంబాడీ హక్కుల పోరాట సమితి జాతీయ నాయకుడు మూడే శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల తొలగింపు అన్యాయం

ఓబులవారిపల్లె, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎండీసీలో సుమారు 47 మంది ఉద్యోగులను తొలగించడం అన్యాయమని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాజంపేట ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం కార్మికులతో కలసి సీపీవోను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పునరావాస గ్రామాలకు సంబంధించిన వారికి అప్పటి ప్రభుత్వంలో ఉద్యోగాలు ఇస్తే కూటమి ప్రభుత్వం వారి ఉద్యోగాలు తొలగించడం న్యాయం కాదన్నారు. మంగంపేట పరిధిలో పనిచేస్తున్న సుమారు 47 మంది అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులతో పాటు, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 200 మందిని తొలగించడం అన్యాయమన్నారు. వీరికి యథావిధిగా ఉద్యోగాలిచ్చి న్యాయం చేయకపోతే ధర్నా చేస్తామని, అవసరమైతే కోర్టుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని సీపీవోకు తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని సీపీవో సుదర్శన్‌రెడ్డి తెలిపారు. రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మహేష్, ఎస్‌పీఎఫ్ ఎస్ఐ శివ బందోబస్తు ఏర్పాటు చేశారు.



కేకే చౌదరికి ఘన స్వాగతం

పెనగలూరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఖాదీ గ్రామీణ అభివృద్ధిశాఖ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన కస్తూరి కోటేశ్వరచౌదరికి గురువారం తిరుపతి విమానాశ్రయంలో ఘనస్వాగతం పలికినట్లు తెలుగు యువత పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ఎన్. రాంప్రసాద్‌నాయుడు, జిల్లా అధికార ప్రతినిధి కొత్త బాలకృష్ణ తెలిపారు. కార్పొరేషన్ చైర్మన్ పదవి చేపట్టిన తర్వాత తొలిసారిగా నియోజకవర్గానికి వస్తున్న కేకే చౌదరిని స్వాగతం పలికేందుకు 50 కార్లతో మండల టీడీపీ నాయకుల బృందం తిరుపతికి వెళ్లినట్లు తెలిపారు. కోడూరు పట్టణ ప్రారంభం నుంచి అభిమానులు కేకే చౌదరి కార్యాలయం వరకు బైకు ర్యాలీ నిర్వహించారన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జికాశర్ల నాగేశ్వరనాయుడు, దాసరి దామోదర్‌నాయుడు, డి.సురేష్, పాలూరు సురేష్‌నాయుడు, కేఎస్ ఆర్, నరేష్‌బాబునాయుడు, కొత్త బాలకృష్ణ, ఎన్.రాంప్రసాద్ నాయుడు పాల్గొన్నారు.

చిరుత సంచారంతో భయం గుప్పెట్లో ప్రజలు


చిరుతపులి దాడిలో గాయపడిన దూడ

నిమ్మనపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో చిరుతపులి సంచారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. శుక్రవారం తవళం పంచాయతీ ఎగువపల్లికి చెందిన రైతు శ్రీనివాసులు తన వ్యవసాయ పొలం వద్ద ఆవులను కట్టేశాడు. కట్టేసిన దూడపై చిరుత పులిదాడి చేసింది. అయితే దూడ చిరుతపులి నుంచి తప్పించుకుని ఇంటికి చేరింది. అప్పటికే చిరుత దాడి చేయడంతో వళ్లంతా రక్తం కారుతోంది. విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఇటీవల చల్లావారిపల్లి, పారేసువారిపల్లెల్లో ఒక ఆవును, మేకను తిన్న విషయం తెలిసిందే. దీంతో సమీప గ్రామస్థులు భయభ్రాంతులు చెంది కొండ సమీపంలోకి గొర్రెలు, మేకలు, పాడి ఆవులు తోలేందుకు సాహసించడంలేదు. కొద్ది రోజులుగా చిరుతపులి సంచరిస్తున్నా అటవీ శాఖ అధికారులకు మాత్రం చీమ కుట్టినట్లైనా లేదు. చిరుతను బంధించేందుకు కనీస చర్యలు కూడా తీసుకోక పోగా చిరుతను వేటాడదదని చెబుతుండం గమనార్హం. ఇదిలాగే కొనసాగితే ఎవరో ఒకరు చిరుతకు బలికావల్సి వస్తుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

190 లీటర్ల నాటుసారా స్వాధీనం - వ్యక్తి అరెస్టు


రవినాయక్‌ను అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

మదనపల్లె టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం నారమాకుల తండా నుంచి 190 లీటర్ల నాటుసారా తరలిస్తున్న రవినాయక్‌ను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం ఉదయం మాలేపాడు క్రాస్ వద్ద ఎక్సైజ్ సీఐ భీమలింగ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా నారమాకులతండా వాసి బుక్కే రవినాయక్ బైక్‌లో 190 లీటర్ల నాటుసారా తరలిస్తూ పట్టుబడ్డాడు. దీంతో నాటుసారా, బైక్‌ను సీజ్ చేసిన ఎక్సైజ్ పోలీసులు రవినాయక్‌ను అరెస్టు చేశారు. సారా కొనుగోలు చేసేందుకు ఆర్డర్ ఇచ్చిన నక్కలదిన్నెతండాకు చెందిన బుక్కే పద్మావతి మీద కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. అలాగే కురబలకోట మండలం తెట్టుగ్రామం వద్ద కర్ణాటక మద్యం విక్రయిస్తున్న జి.అనురాధను అరెస్టు చేసి ఆమె వద్ద 76 టెట్రా ప్యాకెట్లను స్వాదీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు. ఈ రెండు కేసుల్లో పట్టుబడిన నిందితులిద్దరినీ రిమాండ్‌కు తరలించామని సీఐ పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు డోర్కాస్, జబీవుల్లా, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

26న జానపద నృత్య పోటీలు

రాయచోటిటౌన్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వశాఖ, రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో డైట్ కళాశాలలో 26న జిల్లా స్థాయి బాలరంగ్ జానపద నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. విద్యార్థుల్లో జాతీయ స్ఫూర్తిని పెంపొందించడం, విభిన్న సాంస్కృతిక విలువలపై అవగాహన పెంపొందించడం ప్రధాన ఉద్దేశమన్నారు. తప్పెటగుళ్లు, కర్రసాము, చెంచులవేట, ధింసా, జాలరి, బంజారా మొదలైన జానపద నృత్య గీతాలు ప్రదర్శించవచ్చన్నారు. నృత్య, గాత్ర, వాయిద్య నైపుణ్యం గల విద్యార్థులు ఒక సమూహంగా (గరిష్టంగా 15 మంది విద్యార్థులు) పాల్గొనవచ్చన్నారు. జిల్లా జట్టు తప్పనిసరిగా తమ ప్రాంతంలోని సంప్రదాయ జానపదాలను మాత్రమే ప్రదర్శించాలన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే విద్యార్థులందరూ తప్పనిసరిగా గుర్తింపు కార్డులు కలిగి ఉండాలన్నారు. జిల్లా నుంచి ఒక ఉత్తమ జట్టును మాత్రమే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. ఉపాధ్యాయులు పిల్లల ఆసక్తిని గమనించి వారిని ప్రోత్సహించి, ప్రధానోపాధ్యాయుడి ద్వారా విద్యార్థుల జాబితాను డైట్ లెక్చరర్ అసదుల్లాబాషా మొబైల్ నెంబర్ 9440084715కు వాట్సాప్ చేయాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

క్రిటికల్ కేర్ బ్లాక్ కోసం రూ.30 కోట్లు మంజూరు చేయండి

మంత్రి సత్యకుమార్‌ను కోరిన మంత్రి మండిపల్లి


మంత్రి సత్యకుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న మంత్రి మండిపల్లి

రాయచోటిటౌన్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): రాయచోటిలో క్రిటికల్ కేర్ బ్లాక్ (సీసీబీ) ఏర్పాటుకు రూ.30 కోట్లు మంజూరు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను రవాణా, యువజన, క్రీడా మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కోరారు. భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన క్రిటికల్ కేర్ బ్లాక్‌ల ఏర్పాటు విధానం ద్వారా తీవ్రమైన కేసులకు చికిత్స అందించే సౌకార్యాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని, మంత్రి సత్యకుమార్‌ను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కోరారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా క్రిటికల్ అండ్ ట్రామా కేర్ సేవలను రోగులకు ప్రత్యేక సంరక్షణ, పర్యవేక్షణ అవసరం కాబట్టి, ప్రస్తుతం సామర్థ్యం సరిపోదని, అందుకోసం రాయచోటిలో 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ ఏర్పాటుకు రూ.30 కోట్ల మంజూరు చేయాలని మంత్రి కోరిన వెంటనే ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సానుకూలంగా స్పందించి రూ.30 కోట్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

మదనపల్లె టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తన తండ్రికి ద్రోహం చేశాడనే కోపంతో ఓ వ్యక్తి పిల్లనిచ్చిన మామనే హత్య చేసి జీవిత ఖైదు శిక్షకు గురయ్యాడు. వివరాల్లోకెళితే... సోమల మండలం నెల్లిమంద పంచాయతీ గొల్లపల్లె వాసి వెంకటసిద్దులు కుమార్తె సిద్ద రత్నమ్మను కలికిరి మండలం గుట్టపాళెం వాసి రెడ్డెప్ప కుమారుడు సుధాకర్‌కు ఇచ్చి వివాహం చేశాడు. కాగా అప్పట్లో రెడ్డెప్ప అనారోగ్యానికి గురవగా, తన మామ వెంకటసిద్దులే తన తండ్రికి చేతబడి చేశాడనే అనుమానంతో మామపై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో 2017 ఆగస్టు 7న వెంకటసిద్దులు పొలంలోనే హత్యకు గురయ్యాడు. దీంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో చౌడేపల్లె సీఐ రవీంద్ర కేసు దర్యాప్తులో పలు అంశాలు వెలుగు చూశాయి. పొలం వద్ద వున్న వెంకటసిద్దులును సుధాకర్ కొడవలితో నరికి హత్య చేశాడు. కాగా సుధాకర్, బావమరిది రెడ్డెప్పతో కలసి హత్య చేశామని వీఆర్‌ఓకు వివరించారు. వీఆర్‌ఓ సమాచారంతో పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు పంపారు. ఈ కేసు కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు విధించారు.

వీఆర్‌ఏ శాంతమ్మపై బెదిరింపులు

ఒంటిమిట్ట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఓబులేశుకోనలో ప్రభుత్వ భూమి ఆక్రమణను అడ్డుకున్న వీఆర్‌ఏ శాంతమ్మను పరుషపదజాలంతో దూషించారని బాధితురాలు తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో పెన్నపేరూరు వీఆర్‌ఏ శాంతమ్మ, గంగపేరూరు వీఆర్‌ఏ రమణ ఆక్రమిత సర్వేనంబరు 661లో ప్రభుత్వ భూమిని ఆక్రమించ వద్దని నిబంధనల ప్రకారం రికార్డులు తహసీల్దారుకు చూపించాలని గురువారం రాత్రి ఇంటి వద్దనున్న సుధాకర్‌కు తెలిపారు. వెంటనే సుధాకర్, వారి కుటుంబ సభ్యులు వీఆర్‌ఏ శాంతమ్మపై తమ పనులను అడ్డుకుంటావా నీశక్తి ఎంత, నీకులం ఏది అని పరుషపదజాలంతో పెద్ద ఎత్తున దూషించినట్లు బాధితురాలు ఫిర్యాదు చేశారు. దీనిపై వీఆర్వో ఆంజనేయులు క్షేత్రస్థాయిలో విచారించి తహసీల్దారుకు నివేదిక అందించారు. దీనిపై తహసీల్దారు రమణమ్మను వివరణ కోరగా తమ వీఆర్‌ఏని ఇబ్రహీంపేట వాసి సుధాకర్ దూషించారని అతనిపై శనివారం పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమిం చడమేగాక సిబ్బందిని దూషించడం తప్పన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యలతో ఓ యువతి విషంతాగి ఆత్మహత్యకు యత్నించిందని పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మదనపల్లె పట్టణం, బుగ్గకాల్వ చెందిన యువతి తండ్రి కొద్దికాలం కిందట చనిపోయాడు. తల్లి తనను వదిలేసి దూరంగా ఉంటోంది. దీంతో మనుస్తాపానికి గురైన యువతి విషం తాగి అపస్మారస్థితిలో పడిఉండడానికి గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ ఎస్‌ఐ అన్సర్ బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పెన్నాతీరం... మునెయ్య నిలయం

- మహిమాన్వితుడు మునెయ్యస్వామి
- 25న తిరుణాళ్ల
- రాష్ట్రం నలుమూలల నుంచి భక్తుల రాక


స్వామి వారికి పూలతో అలంకరించిన పట్టుమెత్త

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సుమారు 12 ఏళ్ల ప్రాయంలోనే యాగంటి నుంచి ప్రొద్దుటూరు రామేశ్వరానికి వచ్చిన దొంగకోళ్ల మునిస్వామిగా వ్యవహరించే మునెయ్య స్వామి తిరుణాళ్ల సోమవారం వేడుకగా నిర్వహించనున్నారు. అవదూతగా, సిద్ధపురుషుడిగా పేరుపొందిన మునెయ్యస్వామి కార్తీక మాసం చివరి సోమవారం సజీవ సమాధి అయిన రోజు కావడంతో ఆరోజున ప్రత్యేకించి తిరుణాళ్ల నిర్వహిస్తుంటారు. మునెయ్యస్వామి భక్తులపాలిట కొంగు బంగారంగా పేరుపొందారు. స్వామి మహిమల గురించి తెలియడంతో దేశ వ్యాప్తంగా భక్తులు ఉన్నారు. రామేశ్వరంలోని పెన్నాతీరంలో వెలసిన మునెయ్యస్వామి ఆలయంలో 25వ తేదీ కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా తిరుణాళ్ల జరుగనుంది. మునెయ్య మునిస్వామి మహిమలు, మహత్యం గురించి విస్తృత ప్రచారంలో ఉన్నాయి. ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం సమీపంలో 400 ఏళ్ల కిందట మునెయ్యస్వామి సజీవ సమాధి అయ్యారని చరిత్ర చెబుతోంది.

● మునెయ్యస్వామి చరిత్ర

స్వామి 12 ఏళ్లలోనే యాగంటిలో ఉండగా రాజరాజేశ్వరిదేవి అమ్మవారి దర్శనం అవడం, ఆమె ఆదేశానుసారం రామేశ్వరానికి వచ్చినట్లు పేర్కొంటారు. ఇక్కడికి వచ్చిన ఆయన పాతకోట బయపురెడ్డి ఇంటికి వచ్చి వెళ్లేవారు. కురచగా ఉంగరాల జుట్టుతో గోచి మాత్రమే ధరించి బాలుడి రూపంలో పిల్లలతో కలిసి ఆడిపాడి అలసిపోయి రాజరాజేశ్వరి దేవి ఆలయంలో విశ్రాంతి తీసుకునేవారు. పెన్నాతీరం బాలుడి ఆటస్థలంగా మారడంతో తోటి పిల్లలతో గోలీలు, బొంగరాలు ఆడుతూ వారి బొంగరాలు పగులకొట్టేవాడు. ఇసుక తీసుకుని పిల్లల చేతిలో పోస్తే అది చక్కెరగా మారేదని, అందుకే పిల్లలు ఎప్పుడూ ఆయన వెంట తిరిగేవారన్నారు. అయితే అప్పట్లో పెన్నాతీరం అడవిని పోలి ఉండడంతో ఆ అడవిలో తిరిగే పులులు, పాములతో సరదాగా ఆడుకునేవాడు. ఆకలైతే కోళ్లను దొంగిలించి తీసుకెళ్లి తింటుండడంతో ఆయనను దొంగకోళ్ల మునిస్వామిగా పిలిచేవారు. మౌనవ్రతం చేపట్టి ఎవరితో మాట్లాకుండా ఉండడంతో ఆయనను మౌనిస్వామిగా పిలుస్తుండగా కాలక్రమంలో మునెయ్యస్వామిగా పిలుస్తున్నారు. మునెయ్యస్వామి అనుగ్రహంతో పుట్టిన పిల్లలకు మునెయ్య, మునెమ్మ, మునిరాజు పేర్లు పెట్టుకుని స్వామివారిని తమ ఇంటి దేవుడిగా భక్తులు కొలుస్తున్నారు. మునెయ్యస్వామి ఉన్నట్లుండి గాలిలో చూస్తూ అదిలించేవారు. ఏమైందని అడిగితే అడవిలో గోవులపై పులి దాడి చేయబోతే తరిమేశానని చెప్పేవాడు. రైతులు వర్షం కురవడంలేదని అడిగితే ఆ రోజు రాత్రే వర్షం కురిసేదంటారు. బయపురెడ్డి ఇంటికి వస్తుండడంతో ఆ ఇంటివారికి తన మహిమలు చూపి ఆ ఇంటి ఇలవేల్పుగా మారారు. స్వామి తన 40వ ఏట కార్తీక మాసం చివరి సోమవారం పాతకోట ఎల్లారెడ్డి స్థలంలో సజీవ సమాధి అయ్యారు. సమాధి అయ్యే ముందు ఆయన వెలిగించిన దీపం ఇప్పటికీ వెలుగుతూ భక్తులకు దర్శనమిస్తోంది. నాటి నుంచి కార్తీక మాసం చివరి సోమవారం మునెయ్యస్వామి తిరుణాళ్లను నిర్వహిస్తున్నారు. తిరుణాళ్ల సందర్భంగా భక్తులు కోళ్లు, మేకలను బలి ఇస్తారు. కొందరు భక్తులు తలనీలాలు, పుట్టు వెంట్రుకలు స్వామివారికి ఇస్తారు. ఆలయం గోపురంపైన చెక్కిన శిల్పాలు భక్తులను ఆకట్టుకుంటాయి. ఆలయం గోపురంపై గాంధీ, నెహ్రూ, సుభాష్‌చంద్రబోస్ వంటి దేశ నాయకుల విగ్రహాలు దేశభక్తిని పెంపొందిస్తాయి. ఆలయం లోపల గోపికల వస్త్రాలను అపహరించే శ్రీకృష్ణుడి విగ్రహం, నంది విగ్రహం, ఆదిశేషునిపై విష్ణుమూర్తి, భూమిలో కుంగిన రథ చక్రాన్ని పైకి ఎత్తుతున్న కర్ణుడు వంటి శిల్పాలు ఆకట్టుకుంటాయి.

మహిళలే పూజారులు

పాతకోట మునెమ్మ వైవాహిక జీవితాన్ని త్యజించి ఆలయంలో మునెయ్యస్వామిని సుమారు వందేళ్లకు పై వయసులో కూడా పూజలు చేసేది. పాతకోట ఎల్లారెడ్డి స్థలంలో ఆలయం నిర్మించడం, వారి ఇలవేల్పుగా నిలవడంతో పాలకోట వంశీకులే ఇప్పటికీ పూజారులుగా వ్యవహరిస్తున్నారు. మొదటి తరంలో మునెమ్మ అనే భక్తురాలు స్వామివారిని సేవించేది. ఆలయ అభివృద్ధికి కృషిచేసేవారు. అప్పటి నుంచీ నేటి వరకూ మహిళలే ఆలయంలో పూజలు నిర్వహిస్తుంటారు. సుమారు 360 ఏళ్లగా స్వామి వారి సేవ చేయడం తమ అదృష్టమని నేటి పూజారులు వివరిస్తుంటారు. కాగా స్వామి వారి సజీవ సమాధి పక్కనే ఒక పట్టె మంచం వేసి రాత్రికి పూలతో అలంకరించేవారు. తెల్లవారి చూస్తే ఒకరు పడుకుని నిద్రపోయిన విధంగా పూలు నలిగి ఉంటాయి. ఇప్పటికీ ఇలాగే జరుగు తుండడం ఆయన మహిమలకు తార్కాణమని భక్తుల విశ్వాసం. ఇంతటి మహిమాన్వితుడు అప్పట్లో వాడిన వస్తువులు ఉన్నాయి. ఆంధ్ర, తెలంగాణా, తమిళనాడు, కర్ణాటకల నుంచి భక్తులు తిరుణాళ్ల సందర్భంలో స్వామివారి దర్శనానికి వస్తుంటారు.




ఆలయం ముందు భాగం - మునెయ్యస్వామి మూలవిరాట్టు - గోపికల వస్త్రాలను అపహరిస్తున్న శ్రీకృష్ణుడు ప్రతిమ

సమస్యల పరిష్కారమే లక్ష్యం

అన్నిశాఖల అధికారులతో సమీక్షించిన కలెక్టర్ చామకూరి శ్రీధర్


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

సుండుపల్లె, నవంబరు22 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అన్నిశాఖల అధికారులు పనిచేయాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే వినతుల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలను తిప్పుకోకూడదన్నారు. ఫ్రీ హోల్డ్ భూములు, చుక్కల భూములు, మ్యుటేషన్లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థుల అపార్ ఐడీ, బ్యాంక్ అకౌంట్లకు ఆధార్ లింకేజీలను పరిశీలించి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలన్నారు. ప్రభుత్వ స్థలాలకు రక్షణ కల్పించాలని ఆదేశించారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

వైసీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని కలెక్టర్ హౌసింగ్, సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల వ్యాప్తంగా 2,352 గృహాలు మంజూరయ్యాయని, 1096 మాత్రమే పూర్తి చేశారని, 573 పనులు ప్రారంభించకపోవడంతో వాటిని లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించామన్నారు. ఇంకా 683 గృహ నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉందన్నారు. 2025 ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. పూర్తి చేయకపోతే స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామన్నారు.

మండల తీర్మానం ఇవ్వరా....

పల్లె పండుగలో భాగంగా నిదులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించేందుకు మండల తీర్మానం ఇవ్వరా అని కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. గ్రామ సభల ద్వారా గుర్తించిన రోడ్లు లేని ప్రాంతాల అభివృద్ధికి నిదులు కేటాయించిందన్నారు. సత్వరం పనులు ప్రారంభించేందుకు మండల తీర్మానం, పనుల నివేదికను అందించాలని ఎంపీడీఓ సుధాకర్ రెడ్డిని ఆదేశించారు.

వినతుల వెల్లువ

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, రాష్ట్ర మంతా పల్లెపండుగలో భాగంగా అభివృద్ధి పనులు జరుగుతుంటే సుండుపల్లె మండలంలో మాత్రం పనులు ప్రారంభం కాలేదని టీడీపీ, బీజేపీ నేతలు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. రోళ్లమడుగు నీటి పథకం పనులు అర్ధంతరంగా ఆగిపోయాయని, ఝరికోన ప్రాజెక్టు నుంచి రైతుల కోసం సాగు నీటి కాల్వలు ఏర్పాటు చేయాలని, కమ్మ గుట్టపల్లె గ్రామస్థులు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ వెంకటరత్నం, హౌసింగ్ పీడీ సాంబశివయ్య, తహసీల్దార్ దైవాదీనం, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, ఏఓ మాలిక్‌బాషా, ఏపీఎం శ్రీనివాసులు, మండల సర్వేయర్ వెంకటసుబ్బయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్, వ్యవసాయశాఖ అధికారి మహబూబ్‌బాషా, సచివాలయ ఉద్యోగులు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

'భూమిని కాజేసే వారిపై చర్యలు తీసుకోండి'

గాలివీడు, నవంబరు22(ఆంధ్రజ్యోతి): తప్పుడు పత్రాలు సృష్టించి భూమిని కాజేయాలని యత్నిస్తున్న జిలానీ బాషా, తదితరులపై అధికారులు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ భాగ్యలతకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకెళితే... మండల కేంద్రంలోని సర్వే నెంబరు 477, 475లలో హసనాపురం ఖాదర్ వలి మిరాయిగిరి సన్నేసాబ్, హసనాపురం ఖైరున్‌బీ, హసనాపురం జవుల్లా, షేక్ అఖిలభాను, షేక్ నసీబ్ జాన్, షేక్.అమీద, షేక్.శంషాద్ అనుభవదారుల పూర్వీకులకు ప్రభుత్వం భూమి ఇచ్చింది. దశాబ్దాలుగా సాగు చేసుకుంటూ జీవిస్తున్నారు. అయితే సంబంధం లేని ఇదే గ్రామస్థుడు జిలానీబాషా తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి దౌర్జన్యాలు చేస్తూ మమ్ములను అనేక ఇబ్బందులు పెడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సుమారు 80ఏళ్లగా సర్వే నెంబర్లు 477, 475లలో సాగు చేసుకుంటున్న భూమికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్స్ ఉన్నాయన్నారు. ఈ సమస్యపై జిల్లా ఉన్నతాధికారులకు మేము సాగు చేసుకుంటున్న భూమిలో వారెవరికీ హక్కులు లేవని ఫిర్యాదు కూడా చేశామన్నారు. నాడు రెవెన్యూ అధికారులపై సర్వే నెంబర్లలో వారికి ఆ భూమే లేదని లేఖ రూపంలో పంపారు. తప్పుడు ఎంజాయ్‌మెంట్ పొంది మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. రికార్డులను పరిశీలించి భూకబ్జాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుని వారి నుంచి మాకు ప్రాణ రక్షణ కల్పించి న్యాయం చేయాలని విన్నవించారు. వినతి పత్రం అందజేసిన వారిలో అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, బాధితులు ఉన్నారు.

సీతాఫలం - సాగులో సఫలం

మండలంలో మొదటి సారిగా సాగు

ఆదాయం మెండు





పెద్దమండ్యం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సీతాఫలం సీజన్ వస్తే అందరూ అడవుల్లో పండే ప్రకృతి సీతాఫలాలను తెచ్చుకుని లేదా కొనుగోలు చేసి తింటారు. అయితే ఈసీజన్ గ్రామీణ పేదలకు జీవనోపాధి. ఈసీజన్‌లో అడవులకు వెళ్లి సీతాఫలం తెచ్చికుని మాగబెట్టి అమ్ముకుంటుంటారు. దీంతో ఆర్థికంగా కొంత ఊపిరి పీల్చుకుంటారు. మండల రైతు అబ్దుల్లా సీతాఫలం సాగు చేస్తూ లాభాల్లో పురోగతి సాధిస్తున్నాడు. వివరాల్లోకెళితే... పెద్దమండ్యం మండలం కలిచెర్లకు చెందిన అబ్దుల్లా తన ఆరెకరాల్లో సీతాఫలం తోట సాగు చేసి మంచి దిగుబడులు సాధిస్తున్నారు. ఈ సీతాఫలం మన ప్రాంతంలో తోటలు సాగు చేయడం విశేషం. దీంతో సీతా ఫలం సాగుపై మండల రైతుల దృష్టి మళ్లింది. సస్యర క్షణ శ్రమ తక్కువ, ఆదాయం ఎక్కువ తెచ్చే పంట సీతాఫలం తోటల సాగుపై రైతు పలు అంశాలు వెల్లడించారు. మూడేళ్ల కిందట సీతాఫలం మొక్కలను మహరాష్ట్రలోని షోలాపూర్ నుంచి దిగుమతి చేసుకున్నారు. ఎన్ఎంకే గోల్డన్ వెరైటీ సీతాఫలం ఎకరాకు 450 మొక్కలు, సాగుకు రూ. 2లక్షల నుంచి రూ. 2. 5 లక్షలు పెట్టుబడి పెట్టాలి. ఈ పంట సాగు చేస్తే రెండేళ్లలోనే దిగుబడులు వస్తాయి. సీతాఫలం చెట్లు కాలపరిమితి 25 నుంచి 30 ఏళ్లు. తోటలు సాగు వ్యవసాయ సాగు పద్ధతులు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పంట సాగుతో నీటి ఆదా జరుగుతుందన్నారు. ఏటా నికర ఆదాయం వచ్చే పంటతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని వెల్లడించారు. ఎలాంటి భూముల్లో అయినా ఈ పంటలు సాగు చేయవచ్చు. ఈ ఫలం తినడం వల్ల కంటికి మంచిది. రక్తహీనత నివారిస్తుంది. శరీర రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. క్యాన్సర్ కణాలను నాశనం చేస్తాయని వైద్య నిపుణులు చెపుతున్నారు. సీతాఫలం నాణ్యత బట్టి మార్కెట్‌లో కిలో ధర రూ. 100 నుంచి రూ 120 పలుకుతోందన్నారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో వ్యాపారులు నేరుగా తోటల వద్దకు వచ్చి పంట దిగుబడులు కొనుగోలు చేస్తున్నారు. సీతాఫలం తోటలు సాగు చేసుకోవడానికి మన రైతులు దృష్టి సారిస్తే లాభాలు పొందవచ్చని రైతు తెలిపారు.

మహానగరాల్లో మంచి డిమాండ్

హైదరాబాద్, ఢిల్లీ వంటి నగరాల్లో మన సీతాఫలానికి మంచి డిమాండ్ ఉంది. మార్కెటింగ్ చేసుకోవడానికి అవగాహన అవసరం. సీతాఫలం తోటలు సాగు చేసుకుంటే లాభ దాయక పంట. ఏటా నికర ఆదాయం వస్తుంది.

షేక్ అబ్దుల్లా, కలిచెర్ల రైతు, పెద్దమండ్యం మండలం


తోటలో కాసిన సీతాఫలం

ఎగుమతులకు సిద్ధంగా...



సబ్సిడీలు పొందాలంటే.. ఎన్‌పీసీఐ తప్పనిసరి

- లేదంటే సబ్సిడీలు రావంటూ అధికారుల హెచ్చరికలు
- పోస్టాఫీసుల్లో నమోదు చేస్తున్న ఉద్యోగులు



పోస్టాఫీస్ వద్ద ఎన్‌పీసీఐ నమోదు చేస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాల నుంచి సంక్షేమ ఫలాల సబ్సిడీ మొత్తాన్ని పొందాలంటే నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) లింకింగ్ తప్పనిసరిగా చేయించుకోవాల్సిందేనని అధికారులు పేర్కొంటున్నారు. లేదంటే సబ్సి డీలు రాకపోవచ్చని హెచ్చరిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే అన్ని రకాల సబ్సిడీలు పొందాలంటే తప్పనిసరిగా లింకు చేయించుకోవాల్సిందేనని తెగేసి చెబుతున్నారు. ఆధార్, పాన్ కార్డులు బ్యాంకుకు లేదా ఎన్‌పీసీఐకి తప్పనిసరిగా లింక్ కావాల్సిందేనని తేల్చి చెబుతున్నారు. ఇందుకు సంబంధించి పోస్టల్ ఉద్యోగులు లింక్ చేసేందుకు అర్హుల నుంచి తంబింగ్ ప్రాసెస్ భారీగా చేస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన దీపం-2 పథకానికి ఇప్పటి వరకు చాలా మందికి సబ్సిడీ పడక పోవడంతో లబ్ధిదారులు ఈ లింక్ చేయించుకునేందుకు పరుగులు తీస్తున్నారు. దీనికి తోడు త్వరలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయబోయే మాతృవందనం కోసం విద్యార్థుల తల్లిదండ్రులు ఈ లింకింగ్ కోసం పడిగాపులు కాస్తున్నారు. అయితే అధికారులు పబ్లిసిటీ ఇవ్వకపోవడంతో చాలా మందికి తెలియడం లేదు. ఈ లింకింగ్ కోసం రూ.200 రుసుం చెల్లించాల్సి వుంటుంది.



సబ్సిడీలు ఖాతాల్లో జమకావాలంటే...

పీఎం కిసాన్, అన్ని రకాల పెన్షన్లు, స్కాలర్‌షిప్, ఎల్‌పీజీ గ్యాస్, ఎరువుల సబ్సిడీ, మాతృవందనం, ఎంఎన్ఆర్ఈజీఏ ఇలా అన్ని రకాల సబ్సిడీలు వారి ఖాతాల్లో జమకావాలంటే తప్పనిసరిగా లింక్ చేసుకోవాల్సిందేనని అధికారులు అంటున్నారు. ఇందు కోసం స్థానిక పోస్టాఫీసు వద్ద తుమ్మలపల్లె, వలసపల్లె, జువారి బ్రాంచ్ పోస్ట్ మాస్టర్స్ వచ్చిన వారికి లింకింగ్ ప్రాసెస్ చేస్తున్నారు.

భవిష్యత్తులో అన్ని పోస్టాఫీసుకే...

రానున్న రోజుల్లో అన్ని రకాల సేవలు పోస్టాఫీసు నుంచే చేయనున్నట్లు తెలుస్తోంది. ఇకపై గ్రామాల నుంచి డబ్బు కోసం బ్యాంకులకు రాకుండా ప్రతి పల్లెలో పోస్టు బ్యాంకును ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. అందరికీ అందుబాటులో ఉండేలా, సులభ తరంగా నేరుగా డబ్బు తీసుకునేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం తన అధీనంలో ఉన్న పోస్టాఫీసులను వినియోగిస్తున్నట్లు భావిస్తున్నారు. ఒకవిధంగా చెప్పాలంటే అన్ని రకాల సబ్సిడీలు కేంద్ర ప్రభుత్వ అధీనంలోనే ఉండే విధంగా ఈకార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేసే ప్రయత్నంలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందుకు తగ్గట్టుగానే ఎన్‌పీసీఐకి లింక్ తప్పనిసరి చేస్తున్నారు.

సచివాలయ సిబ్బందిని పోస్టల్ వారితో లింక్‌చేశాం

ఎన్‌పీసీఐకి లింక్‌కాని వారి లిస్టు కలెక్టర్ కార్యాలయం నుంచి మాకు వచ్చింది. సుమారు మూడువేలకు పైబడి మంది బ్యాంకుకు, లేదా పోస్టల్ అకౌంట్‌కు లింక్ కాని వారు ఉన్నారు. వారందరి ఆధార్, పాన్ కార్డులను ఎన్‌పీసీఐకి లింక్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా సచివాలయ సిబ్బందిని పోస్టాఫీసు సిబ్బందితో సమన్వయం చేసుకుంటున్నారు. ఇప్పటికే ఆధార్ అకౌంట్‌కు లింక్ అయినవారికి అవసరం లేదు.

–శేషఫణి, కమిషనర్, ఎర్రగుంట్ల

రైతులకు అందుబాటులో అగ్రిల్యాబ్

- జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీడీఏ మల్లికార్జున

కమలాపురం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులకు అందుబాటులో అగ్రిల్యాబ్‌ను ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం కమలాపురం అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలోని అగ్రి టెస్టింగ్ ల్యాబ్ వ్యవసాయాధికారులకు మరియు వ్యవసాయ విస్తరణాధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అగ్రిల్యాబ్‌లో ఉన్న సేవలను ఉపయోగించుకోవాలన్నారు. ప్రతి రైతు విత్తనాలు, ఎరువులు పరీక్షలను ఉచితంగా చేయించుకోవచ్చన్నారు. పరీక్షల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు పంటలకు ఎలా ఉపయోగించాలనే విషయాలను తెలుసుకోవచ్చన్నారు. డీడీఏ మల్లికార్జున అగ్రిల్యాబ్‌లోని వివిధ రకాల పరికరాలను వాడే విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ నరసింహారెడ్డి, కిరణ్‌కుమార్, వెంకటేశ్వరరెడ్డి, పులివెందుల, ప్రొద్దుటూరు, బద్వేలు, మైదుకూరు, కమలాపురం, రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి, మదనపల్లె, తంబళ్లపల్లె అగ్రిల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.

'బీసీ కుల జనగణన చేపట్టాలి'



సమావేశంలో మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు

కడప మారుతీనగర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బీసీ కులాలకు సంబంధించి కుల జనగణన చేపట్టాలని బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర చైర్మన్ పూర్ణచంద్రరావు, రాష్ట్ర కన్వీనర్ బీసీ రమణ, కో-కన్వీనర్ రెడ్డిబాబు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా శుక్రవారం కడప ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం రాక ముందు నాటి బ్రిటీష్ ప్రభుత్వం గత 1931లో బీసీ కుల జనగణన చేపట్టిందన్నారు. నాటి నుంచి నేటి వరకు పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా బీసీ వర్గాల కుల జనగణన చేపట్టడంలో నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు. ఎన్నికలప్పుడు నా బీసీలు అనే పలు పార్టీల నాయకులు అధికారంలోకి రాగానే బీసీల గురించి మరచిపోతున్నారని ఎద్దేవా చేశారు. ఇటీవల పశువులతో పాటు కుక్కలు, కోళ్ల గణన చేసిన పాలకులకు బీసీ కుల గణన చేయకపోవడంలోని అంతర్యమేమిటని ప్రశ్నించారు. పక్క రాష్ట్రమైన తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అక్కడ బీసీల కుల జనగణన చేపడుతున్న సంగతి తెలిసిందేనన్నారు. అలాగే మన రాష్ట్రంలో కూడా చేపట్టాలన్నారు. చట్ట సభల్లో బీసీ వర్గాలకు జనాభా దామాషా ప్రకారం అందాల్సిన రాజకీయ రిజర్వేషన్‌లు అందలేదన్నారు. బీసీ వర్గాల పిల్లలకు సరైన రీతిలో విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాలు దక్కాలంటే బీసీల జనాభా ఎంత శాతం ఉందనే విషయం బహిర్గతం కావాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ వర్గాల ప్రజలు జాగృతమై పాలక ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశ అనంతరం బీసీ జిల్లా సమన్వయ కమిటీ నూతన ఎన్నిక నిర్వహించారు. జిల్లా చైర్మన్‌గా శివరామాచారి, కన్వీనర్‌గా కృష్ణకిరీటి, ప్రధాన కార్యదర్శిగా మణికుమార్, కో-కన్వీనర్లుగా వివేకానంద, చిన్న ఎన్నికయ్యారు.

సంక్షేమ పథకాలు సకాలంలో అందాలి : కలెక్టర్



డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కలసపాడు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు సకాలంలో అందేలా చూడాలని సచివాలయ ఉద్యోగులను కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలోని తెల్లపాడు పంచాయతీలలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయన ఉద్యానవన పంటలను, చెరువులను, లిఫ్ట్ఇరిగేషన్, డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి అనుసంధానంగా ఉద్యోగులు పనిచేయాలన్నారు. ఉద్యానవన పంటలు సాగుచేస్తే దిగుబడులు ఎలా వస్తాయని రైతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే డ్వాక్రా మహిళలు ఎవరైన లోన్లు తీసుకుని అభివృద్ధి చెందితే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయన్నారు. అలాగే ఉపాధిహామీ పథకం ద్వారా సరైన సమయంలో పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం తెల్లపాడు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు అదనపు గదులు, అటెండరు మంజూరు చేయాలని వారు కలెక్టర్‌ను కోరారు. అనంతరం జిల్లా ఉన్నతాధికారులతో పరిశీలించిన విషయాలపై ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం పాఠశాల ఆవరణలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో 20 ఏళ్ల జైలు

నెల్లూరు (లీగల్), నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : లారీలో ప్రయాణిస్తున్న బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న కేసులో నేరం రుజువు కావడంతో కడప జిల్లా పోరుమామిళ్లకు చెందిన వప్పర్తి సుబ్బారాయుడు అనే నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.22వేల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. 2020 మే 19వ తేదీ రాత్రి ఆత్మకూరు సమీపంలో బాలిక, ఆమె మావయ్య సుబ్బారాయుడు లారీ ఎక్కారు. సంగం వద్ద టిఫిన్ సాకుతో బాలిక మావయ్యను లారీ నుంచి దించిన నిందితుడు ఆ తర్వాత బాలికను తీసుకుని లారీలో కృష్ణపట్నం వైపు వేగంగా వెళ్లాడు. ఆ తర్వాత బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదుతో సంగం పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఎర్రచందనం కేసులో ఐదేళ్లు...

బద్వేలు రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో పట్టుబడిన నిందితుడు యాతగిరి వీరభాస్కర్‌కు తిరుపతి రెడ్‌శాండిల్ స్పెషల్‌కోర్ట్ జడ్జి ఐదేళ్ల జైలు శిక్ష విధించారు. ఎఫ్ఆర్‌ఓ నయీం అలీ వివరాల మేరకు.. 2018వ సంవత్సరంలో లోతువంక బీట్ పరిధిలో అటవీ అధికారులు దాడులు నిర్వహించి.. అక్రమంగా ఎర్రచందనం దుంగలు తరలిస్తున్న వీరభాస్కర్‌ను అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 126 కేజీల బరువు గల 5 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఇతను సిద్దవటం మండలం వెంకటాయపల్లె గ్రామానికి చెందిన వ్యక్తి. ఈ కేసుకు సంబంధించి తిరుపతి రెడ్ శాండిల్ స్పెషల్‌కోర్టు జడ్జి విచారణ జరిపి నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6లక్షల జరిమానాను విధిస్తూ తీర్పు ఇచ్చారు. జరిమానాను చెల్లించని పక్షంలో మరో 6నెలల జైలు శిక్షను అదనంగా విధించినట్లు ఎఫ్ఆర్‌ఓ తెలిపారు.

వార్డెన్‌ను బ్లాక్‌మెయిల్ చేసిన విద్యార్థి సంఘం నాయకుడి అరెస్టు

ముద్దనూరు నవంబరు22 (ఆంధ్రజ్యోతి): బ్లాక్‌మెయిల్ కేసులో రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్ (ఆర్ఎస్ఓ) నాయకుడు తోల్ల జగన్‌ను శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ దస్తగిరి తెలిపారు.

ముద్దనూరులోని ఎస్సీ బాలుర వసతి గృహం వార్డన్ మనోహర్‌ను విద్యార్థి సంఘం నాయకుడు జగన్ డబ్బులు డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోతే ఉద్యోగం పోయేలా చేస్తామని బెదిరించి, మానసిక వేధింపులకు గురిచేశాడు. వార్డన్ ఫిర్యాదు మేరకు జగన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఐదు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



పెండ్లిమర్రి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడ్డాయపల్లె వద్ద గల పాపాఘ్ని నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం రావడంతో రెవెన్యూ సిబ్బంది పోలీసులతో కలిసి దాడులు చేసి ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. పక్కనే ప్రభుత్వ ఇసుక క్వారీ ఉండడం, ఆ ఇసుక క్వారీ పక్కనే అనధికారకంగా ఇసుకను ట్రాక్టర్లతో తరలిస్తున్నారని సమాచారం రావడంతో రెవెన్యూ సిబ్బంది, పోలీసులతో కలిసి అక్కడకు వెళ్లి ట్రాక్టర్లను పట్టుకొని అప్పజెప్పినట్లు ఎస్ఐ తెలిపారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు



చక్రాయపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలపల్లెలో గత నెల అక్టోబరు 26వ తేదీ జరిగిన చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ నాగరాజు విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మాలపల్లెలో యల్లమ్మ అనే మహిళ ఇంట్లో రూ.4.90 లక్షల విలువైన 160 గ్రాముల బంగారు, 90 గ్రాముల వెండి, రూ.7500నగదు దొంగతనం చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా మైదుకూరు మండలం అన్నలూరు గ్రామానికి చెందిన సుబ్బరాయుడు అనే వ్యక్తి చోరీకి పాల్పడినట్లు తేలిందన్నారు. సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం అతని ఇంటి వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. ముద్దాయి అత్తారిల్లు అయిన చిలేకాంపల్లె మాలపల్లె గ్రామానికి వచ్చి తన అత్త చెల్లెలు అయిన యల్లమ్మ ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగతనం చేసినట్లు పంచాయతీదారుల సమక్షంలో ఒప్పుకొని సొత్తు, నగదు చూపడం జరిగిందన్నారు. నిందితుని అరెస్టు చేసి సొత్తును రికవరీచేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

దుర్వాసన వస్తున్న కేక్ అమ్మకం

- కొనుగోలుదారుడి ఫిర్యాదు
- రూ.5 వేలు జరిమానా

బద్వేలుటౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నాలుగురోడ్ల కూడలిలో ఓ బేకరిలో దుర్వాసన వెదజల్లే కేక్‌లను విక్రయిస్తున్నారని ఓ వ్యక్తి మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఆ వ్యక్తి మధ్యాహ్నం బేకరికి వెళ్లి కేక్‌ను కొనుగోలు చేసి ఇంటికి తీసుకువెళ్లాడు. తినేందుకు బాక్స్ ఓపెన్ చేయగా దుర్వాసన రావడంతో వెంటనే బేకరివద్దకు వచ్చి వారిని ప్రశ్నించారు. ఎప్పుడో తయారు చేసిన కేకులను ఎందుకు విక్రయిస్తున్నారని వాగ్వాదానికి దిగాడు. ఆ వెంటనే మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన మున్సిపల్ అధికారులు బేకరిని తనిఖీచేసి కేక్‌ను పరిశీలించగా దుర్వాసన వస్తుండటంతో రూ.5వేలు జరిమానా విధించారు. మరోమారు ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉపాధ్యాయులకు మెమోలు జారీ

కమలాపురం రూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కమలాపురం గురుకుల పాఠశాలలోని ఇద్దరు ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేసినట్లు ప్రిన్సిపల్ తులశమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత రెండు రోజులుగా పాఠశాలలో జరుగుతున్న పరిణామాలకు సంబంధించి పత్రికలో వస్తున్న కథనాలకు సంబంధించి కారణమైన ఇద్దరు ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేశామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అవసరమైన రైతులకు బిందు, తుంపర పరికరాలు ఇవ్వాలి



బిందుసేద్యంపై రైతులకు సూచనలు ఇస్తున్న జిల్లా అధికారి లక్ష్మీదేవి

రాజంపేట, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బిందు, తుంపర సేద్య పరికరాలు అవసరమైన ప్రతి రైతుకు అందించాలని జిల్లా సూక్ష్మ నీటిసాగు అధికారి వై.లక్ష్మీదేవి తెలిపారు. శుక్రవారం బిందు, తుంపర సేద్యం పరిక రాలు, ప్రాథమిక సర్వేలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆకేపాడులో ఏర్పా టు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు సూక్ష్మ నీటి సేద్య పరికరాలను 30,950 హెక్టార్లకు సరఫరా చేయాల్సి ఉండగా 28,950 హెక్టార్లకు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్నారన్నారు. ఇప్పటి వరకు 5445 హెక్టార్లకు జిల్లా పాలనాధికారి ఆమోదంతో మంజూరు ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఐదెకరాల్లో లోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే 5 నుంచి 10 ఎకరాల భూమి ఉన్నవారికి 70 శాతం రాయితీతో బిందుసేద్య పరికరాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

రైతుసేవా కేంద్రాల్లో పనిచేసే గ్రామ ఉద్యాన వ్యవసాయ, పట్టుప రిశ్రమ సహాయకులు, ఎంపీఈవోలు బిందు, సేద్య పరికరాలు కోసం నమోదు చేసుకున్న రైతుల పొలాలను వెంటనే సందర్శించి ప్రాథ మిక సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాజంపేట ఉద్యాన అధికారి జి.సురేష్‌బాబు, ఎంఐడీసీ చంద్ర, ఎంఐ ఇంజనీర్ గురుప్రసాద్, ఎంఏఓ నజీర్, రాజంపేట, నందలూరు, పెనగలూరు రైతుసేవా కేంద్రాల సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

జాతీయ స్థాయి అండర్-17 అథ్లెటిక్స్‌కు కడప విద్యార్థిని శ్రీలతారెడ్డి



శ్రీలతారెడ్డిని అభినందిస్తున్న పాఠశాల హెచ్‌ఎం షర్మిలారాణి

కడప స్పోర్ట్స్ నవంబర్ 22 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఎం.శ్రీలతారెడ్డి 68వ జాతీయ స్థాయి అండర్-17 అథ్లెటిక్స్‌కు పోటీలకు ఎంపికైంది. గత కొన్ని సంవత్సరాలుగా శ్రీలతారెడ్డి పలు క్రీడా పోటీలలో పాల్గొంటూ పలు పతకాలు సాధించింది. ఆ మేరకు ఈనెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొని 400 మీటర్ల రన్నింగ్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించింది. దీంతో ఈ నెల 26 నుంచి 30 వరకు లక్నోలో జరుగనున్న జాతీయస్థాయి పోటీలలో పాల్గొననుంది. శుక్రవారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు షర్మిలారాణి, పాఠశాల పీఈటీ మంజులత, ఉపాధ్యాయులు శ్రీలతారెడ్డిని అభినందించారు.

జిల్లా స్థాయి త్రోబాల్ పోటీలకు నీలకంఠ్రావుపేట విద్యార్థులు ఎంపిక



రామాపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో నిర్వహించే త్రోబాల్ పోటీలకు నీలకంఠ్రావుపేట జిల్లా పరిషత్ హైస్కూల్ (తెలుగు) విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ముక్కవారిపల్లె ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి త్రోబాల్ పోటీల్లో నీలకంఠ్రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు) విద్యార్థులు అండర్-14 విభాగంలో జి.నాగచైతన్య, కె.పవనేశ్, బాబు, స్టాండ్‌బైగా వెంకటరామయ్య, అండర్-17 విభాగంలో హర్షవర్ధన్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ప్రధానోపాధ్యాయులు సుజాతమ్మ, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. పీడీ నరేంద్రకుమార్‌రెడ్డిని అభినందించారు.

వైవీయూ, కేరళ క్రైస్ట్ కళాశాల మధ్య ఎంఓయూ



ఎంఓయూ ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న కళాశాలల ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైవీయూ ఎర్త్‌సైన్స్ విభాగం, కేరళలోని క్రైస్ట్ కళాశాల జియాలజీ అండ్ ఎన్విరాన్మెంటల్ సైన్స్ విభాగం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. వీసీ కృష్ణారెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ పద్మ, ఎర్త్‌సైన్స్ హెచ్‌ఓడీ తుమ్మలకుంట శివ, లక్ష్మీప్రసాద్, క్రైస్ట్ కాలేజీ ప్రొఫెసర్ లింటో, డాక్టర్ రేష్మి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అకడమిక్‌గా, పరిశోధనాపరంగా పరస్పర ప్రయోజనాల కోసం ఈ ఎంఓయూ కుదుర్చుకున్నట్లు వారు తెలిపారు.

బాధితులకు న్యాయం జరిగేనా..?

- హంద్రీ-నీవా భూమిని ప్లాట్లు వేసి అమ్మేసిన రియల్టర్లపై చర్యలేవీ..?
- 1.60 ఎకరాల కాలువ ఆక్రమణ
- కోట్లాది రూపాయల అక్రమ సంపాదన
- ప్లాట్లు వేసి అమ్మినా పట్టించుకోని ఉన్నతాధికారులు



ఆక్రమణకు గురైన హంద్రీ-నీవా భూమిలో ప్లాట్లు వేసి విక్రయాలు జరిపిన భూమి (ఇన్‌సెట్) ప్రభుత్వ స్థలంను స్వాధీనం చేసుకుని ఏర్పాటు చేసిన బోర్డు

కురబలకోట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమి ఆక్రమణను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మంచిదే.. మరి ప్లాట్లు కొనుగోలు చేసిన తమ పరిస్థితి ఏమిటంటూ బాధితులు వాపోతున్నారు. కురబలకోట మండలం అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు అతి సమీపంలో హంద్రీ-నీవా కాలువ పోతుంది. ఈ కాలువకు సంబంధించి 220 సర్వే నంబర్‌లో గతంలో ప్రభుత్వం రైతుల నుంచి 6.40 ఎకరాల భూమిని రైతుల నుంచి కొనుగోలు చేసింది. అందులో మిగిలిన హంద్రీ-నీవా కాలువకు సంబంధించిన 1.60ఎకరాల భూమిని కొంత మంది రియల్‌వ్యాపారులు ఆక్రమించుకుని ప్లాట్లు వేసి కోట్లు గడించారు. తమను ఎవ్వరు పట్టించుకోరనే ఉద్దేశ్యమో? లేక తెలిసిన మమ్మల్ని ఎవరు ఏం చేస్తారులే అనే బరితెగింపో తెలియదు కానీ తాము అనుకున్న పనిని గుట్టుచప్పుడు కాకుండా పూర్తి చేశారు. మండలంలోని అంగళ్లు పరిసర ప్రాంతాల భూములకు విపరీతమైన డిమాండ్ ఉండటం భూముల ధరలు ఆకాశాన్నంటడంతో ఎకరం కోట్లలో పలుకుతుంది. దీంతో ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు సొంతింటి కళ నెరవేరుతుందని కోటి ఆశలతో కన్న కలలు అడియాసలయ్యాయి. తాము అష్టకష్టాలు పడి పైసా,పైసా దాచుకుని సంపాధించిన సొమ్ము రియల్టర్ల మోసం కారణంగా పోగొట్టుకున్నామని లబోదిబోమంటున్నారు. ఇదిలా ఉండగా ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి న్యాయం ఎట్లా జరుగుతుందో తెలియడం లేదు. రెవెన్యూలో పని చేసే కొంత మంది రియల్‌వ్యాపారులకు అండదండలు అందించడంతోనే ఇలా జరిగిందని పలువురు బహిరంగా ఆరోపిస్తున్నారు. కాగా దీనికి సంబంధించి ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'రియల్‌వ్యాపారుల బరితెగింపు... హంద్రీ-నీవా కాలువను అమ్మేశారు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో రెవెన్యూ అధికారులు, హంద్రీ-నీవా అధికారులు ఆక్రమణకు గురైన భూమిలో బోర్డును ఏర్పాటు చేసి స్వాధీనం చేసుకున్నారు. అయితే కొనుగోలు చేసిన కొంత మందికి ఈ విషయం తెలియడంతో తమ పరి స్థితి ఏమిటంటూ తలలు పట్టుకుంటున్నారు. బతుకుదెరువు నిమిత్తం దూరప్రాంతాల్లో ఉన్న వారికి ఈ విషయం తెలియడం లేదు. ఈ నేపథ్యంలో దుశ్చర్యలకు పాల్పడిన రియల్ వ్యాపా రులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

ప్లాట్లు కొనుగోలు చేసేటప్పుడు అధికారులను సంప్రదించండి

మండల పరిధిలో వ్యాపారులు వేసిన వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసేటప్పుడు అధికారులను సంప్రదించి కొనుగోలు చేయాలి. రియల్‌వ్యాపారులు, మధ్యవర్తులు చెప్పే మాయ మాటలను నమ్మి మోసపోవద్దు. పేదలు, మధ్యతరగతి ప్రజలు కష్టపడి సంపాదించిన సొమ్మును పోగొట్టుకోవద్దు. దీనిపై ఏమైనా సమస్యలుంటే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురండి.



- తపశ్విని, తహసీల్దార్, కురబలకోట



పెద్దతిప్పసముద్రం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో విద్యుత్ జనరేటర్ గత కొన్నేళ్లుగా నిరుపయోగంగా పడిఉంది. 15ఏళ్ల క్రితం జనరేటర్‌ను రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. నిరంతరం విద్యుత్ సమస్యలేకుండా ఏర్పాటుచేసిన జనరేటర్‌ను ఇలా మూలనపడవేయడంపట్ల అధికారుల తీరుపై పలువురు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. -పెద్దతిప్పసముద్రం, (ఆంధ్రజ్యోతి)

పోస్టాఫీసు ఖాతాలకు ఆధార్ లింకేజీ

- క్యూ కడుతున్న మహిళలతో హెడ్ పోస్టాఫీస్ కిటకిట



మహిళలతో కిటకిటలాడుతున్న హెడ్‌పోస్టాఫీసు

మదనపల్లె టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పోస్టాఫీసుల్లో మహిళల ఆధార్‌కార్డు లింకేజీ కోసం మహిళలు క్యూ కడుతున్నారు. దీంతో పోస్టాఫీసులు మహిళా ఖాతాదారులతో కిటకిటలాడుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మహాలక్ష్మి పథకం హామీల్లో భాగంగా పేద మహిళలకు రూ.1500 ఆర్థిక సహాయం అందుతుందన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇటీవల పోస్టల్‌శాఖ అధికారులు మహిళలను వారి ఆధార్‌కార్డును పోస్టాఫీసు, బ్యాంకు ఖాతాలకు లింకేజీ చేసుకోవాలని విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో శుక్రవారం స్థానిక హెడ్‌పోస్టాఫీసుకు వద్ద వందల సంఖ్యలో మహిళలు వచ్చారు. ఆధార్‌కార్డులు చేతపట్టుకుని క్యూలో నిల్చుని ఆధార్‌కార్డులు అనుసంధానం కోసం వేచివుండటం కనిపించింది.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ములకలచెరువు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చూపారు. ఇటీవల ఏలూరులో జరిగిన అండర్ - 19 రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్‌లో విద్యార్థి తనుశ్రీ మూడవ స్థానంలో నిలిచింది. అలాగే కర్నూల్‌లో జరిగిన రగ్బీ, బాల్‌బ్యాడ్మింటన్, హ్యాండ్ బాల్ పోటీల్లో విద్యార్థులు ఫాజిల్, దివాకర్, లలిత అత్యుత్తమ ప్రతిభ చూపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ కవిత, ఉపాధ్యాయులు అభినందించారు.

కురబలకోటలో: రాష్ట్రస్థాయి టెన్నికాయిట్‌లో ముదివేడు పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఏటూరు జిల్లా చింతలపూడిలో జరిగిన పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచి బహుమతులను సాధించారు.ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పలువురు అభినందించడంతో పాటుగా స్కూల్ కమిటీ చైర్మన్ 30 టీ షర్ట్స్ అందజేశారు.



ప్రతిభ కనబరిచిన ముదివేడు విద్యార్థులు

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త వహించాలి



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో

కలకడ, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త వహించాలని డీఎంహెచ్‌వో కొండయ్య ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఎర్రకోటపల్లె ఆసుపత్రి పరిధిలోని ఎగువబాట వారిపల్లె, బొజ్జిగుంటపల్లె గ్రామాల్లో జరుగుతున్న ఎన్‌సీడీ 3.0 సర్వేను ఆయన తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో మారుతున్న జీవనశైలి వలన ప్రజలు అసంక్రమిత వ్యాధుల భారీన పడుతున్నట్లు తెలిపారు. అలాగే ప్రజలు ఎలాంటి సందేహాలు లేకుండా క్యాన్సర్ పరీక్షలు చేసుకోవడానికి సహకరించాలని కోరారు. దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడే డ్రైడేను విధిగా పాటించాలని సూచించారు. సిబ్బంది రామకృష్ణ, జయరామయ్య, రమణమ్మ, వరలక్ష్మీ, రాజసులోచన, రెడ్డెమ్మ, వెంకటలక్ష్మీలు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి శ్రద్ధగా చదవాలి

కలకడ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):ప్రతి విద్యార్థి శ్రద్ధగా చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని డీఎల్‌డీవో లక్ష్మీపతి సూచించారు. శుక్రవారం ఆయన కస్తూరిబా పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా తరగతి గదులకు వెళ్లి అందుతున్న సదుపాయాలపై విద్యార్థులను ఆరాతీశారు. అలాగే అంకితభావంతో పని చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్‌రహీం, ప్రిన్సిపాల్ అనిత పాల్గొన్నారు.

మన మరుగుదొడ్లతోనే.. మనకు గౌరవం, ఆరోగ్యం

మదనపల్లె టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మన గృహాల్లో మరుగుదొడ్ల నిర్వహణతోనే మనకు గౌరవం, ఆరోగ్యం ఉంటుందని ఎంపీడీవో తాజ్‌మస్రూర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మన ఇళ్లలో మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా, ఇంటిల్లిపాది ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. ఈ విషయమై మహిళా సమాఖ్య సభ్యులు ఎస్‌హెచ్‌జీ సభ్యులందరికి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సుబ్రమణ్యం, ఇండియన్‌బ్యాంకు మేనేజర్ మూర్తి, సీసీలు లక్ష్మీ, గంగులప్ప, శివశంకర్ , మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

మదనపల్లె అర్బన్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం ఢీ కొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయలైనట్లు మదనపల్లె టూటౌన్ పోలీసులు తెలిపారు. శుక్రవారం మదనపల్లె పట్టణం నీరుగట్టువారిల్లె, సాయిరాంవీధికి చెందిన బొమ్మిశెట్టి రామచంద్ర(49) ఇంటి నుంచి గొల్లపల్లె పోస్టాఫీస్‌లో డబ్బులు కట్టడానికి నడుచుకొంటూ వస్తుండగా తనకల్లు మండలం, కొక్కంటి క్రాస్ వద్ద టి. సదుంకు చెందిన షేక్ ముబారక్ (23) ద్విచక్రవాహనంలో వేగంగా వచ్చి వెనుకవైపు నుంచి ఢీ కొట్టాడు. దీంతో అతను అక్కడే రోడ్డుపై పడిపోవడంతో కుడికాలు విరిగింది, ఎడమకంటిపై గాయమైయింది. బైక నడుపుతున్న ముబారక్‌కు తలకు గాయమైంది. స్థానికులు చికిత్స కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి ఇరువురిని తరలించారు. ముబారక్ ఇక్కడే చికిత్స పొందుతుండగా, రామచంద్రను మెరుగైన వైద్యం కోసం తిరపతికి రెఫర్ చేశారు. టూటౌన్ సీఐ రామచంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో యువకుడికి ..

మదనపల్లె అర్బన్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): వాహనం ఢీ కొన్న ప్రమాదంలో యువకుడికి గాయాలైనట్లు మదనపల్లె అవుట్ పోస్టు పోలీసులు తెలిపారు. పెద్దమండ్యం మండలం, కోటకొండ తాండాకు చెందిన వెంకటేష్ నాయక్ కుమారుడు గోపినాయక్(27) పనిపై గుర్రంకొండకు వచ్చాడు. ఈక్రమంలో గుర్రంకొండ బస్టాండ్‌లో టమోటాల లోడుతో వెళుతున్న వాహనం ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన యువకున్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

మరో ప్రమాదంలో ఇద్దరికి..

మదనపల్లె అర్బన్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ఇద్దరు గాయపడినట్లు బాధితుల బంధువులు తెలిపారు. శుక్రవారం సత్యసాయి జిల్లా ఎన్‌పీ కుంటకు చెందిన వెంకటరమణ(45),అతని కుమారుడు నరేష్(10)లు గుర్రంకొండకు పనిపై బయలుదేరారు. గుర్రంకొండలో వారి ద్విచక్ర వాహనం క్లచ్ విరిగిపోవడంతో బైకు అదుపుతప్పి ఇద్దరు కిందపడ్డారు. గాయపడిన ఇరువురిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

భవన నిర్మాణ కార్మికుడికి..

మదనపల్లె అర్బన్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్ వద్ద కారు ఢీకొన్న రోడ్డుప్రమాదంలో భవన నిర్మాణ కార్మికుడు గాయపడినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. పట్టణంలోని ఎస్టీవి కాలనీకి చెందిన భవన నిర్మాణ కార్మికుడు నగేష్(36)సైకిల్‌పై బెంగళూరు బస్టాండ్‌కు వెళుతుండగా జడ్పీ హైస్కూల్ సమీపంలోని స్పీడ్ బ్రేకర వద్ద గురువారం రాత్రి గుర్తు తెలియని కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో గాయపడిన బాధితుడిని స్థానికులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు.

బి.కొత్తకోట వీఆర్వోల సంఘం అధ్యక్షునిగా శ్రీరాములు



వీఆర్వోల సంఘం అధ్యక్షునిగా ఎంపికైన శ్రీరాములుతో మండల వీఆర్వోలు

బి.కొత్తకోట, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండల వీఆర్ఓల సంఘం అధ్యక్షునిగా పట్టణంలోని బీసీ కాలనీ వీఆర్ఓ గా పనిచేస్తున్న శ్రీరాములు ఎంపికయ్యారు. శుక్రవారం బి.కొత్తకోట తహశీల్దార్ కార్యాలయంలో సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శ్రీరాములు, జయరామిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా వరదరాజులు, కోశాధికారిగా మల్లికార్జున, సలహాదారులుగా కోటిరెడ్డి, రాంప్రసాద్, రజనీకాంత్, నాగేంద్ర తదితర ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షునిగా ఎన్నికైన శ్రీరాములు మాట్లాడుతూ వీఆర్ఓ ల సంక్షేమం, హక్కుల కోసం నిరంతరం శక్తి మేరకు కృషి చేస్తానన్నారు. కాగా కార్యవర్గ ఎంపికలో భాగంగా వీఆర్ఓల సంఘ అధ్యక్షునిగా ఎంపికైన శ్రీరాములు ను తహశీల్దార్ మహమ్మద్ అన్సారీ, ఆర్ఐ వీరాంజనేయులు అభినందించారు. వీఆర్‌వోలు వరదరాజులు, నాగేంద్ర, రజనీకాంత్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వేగం కన్నా భద్రత ముఖ్యమని యువత గుర్తించాలి



రోడ్డు భద్రత అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంవీఐ విజయ కుమారి

పీలేరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపేటప్పుడు వేగం కన్నా భద్రత ముఖ్యమన్న విషయాన్ని యువత గుర్తించాలని పీలేరు ఎంవీఐ విజయకుమారి తెలియజేశారు. పీలేరులోని ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం రోడ్డు భద్రతపై యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి యువత భద్రత కంటే వేగానికి ప్రాధాన్యతనిచ్చి అనేక ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంలో జరుగుతున్న ద్విచక్ర వాహనాల ప్రమాదాల్లో ఎక్కువగా యువత బాధితులుగా మారుతున్నారన్నారు. పీలేరు ఎస్‌ఐ బాలకృష్ణ మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు విధిగా హెల్మెట్, కారు నడిపేటప్పుడు సీట్ బెల్టు ధరించాలన్నారు. రేగళ్లు పీహెచ్‌సీ వైద్యాధికారి కార్తీక్ కుమార్ మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీప వైద్యశాలలకు తరలించాలన్నారు. ప్రముఖ యోగా గురువు వీవీఎస్ లక్ష్మి మాట్లాడుతూమానసిక ప్రశాంతతకు యోగా దోహదపడుతుందన్నారు. ఎంజేఆర్ కళాశాల చైర్మన్ మాధవీలత, పీలేరు ఆర్టీసీ డీఎం బండ్ల కుమార్, ప్రముఖ న్యాయవాది రాయల సుధాకర్, కళాశాల ప్రిన్సిపాల్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


చలో పలమనేరును విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుభాష్

పీలేరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పలమనేరులో శనివారం జరగనున్న 'ధర్మయుద్ధం' చలో పలమనేరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాలమహానాడు నాయకుడు నగరిమడుగు సుభాష్ పిలుపునిచ్చారు. పలమనేరులోని జెండామటం కమ్యూనిటీ హాలులో శనివారం ఉదయం 10 గంటలకు జరిగే 'ధర్మయుద్ధం' కార్యక్రమంలో మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం పాల్గొంటారని ఆయన తెలియజేశారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మాల లు విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు ధరణీ కుమార్, జెట్టి మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో పిల్లలు సరే..టీచర్ ఎక్కడ..?



జమ్మక్కపల్లె పాఠశాలలో ఉపాధ్యాయులు లేక చదువుకుంటున్న పిల్లలు

వాల్మీకిపురం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం మండలంలోని జమ్మక్కపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్నం భోజన సమయానికి కూడా ఉపాధ్యాయుడు హాజరు కాలేదు. ఉదయాన్నే వచ్చిన పిల్లలకు పాఠాలు చెప్పే టీచర్ లేక పిల్లలే ఎవరికీ వారు చదువుకుంటూ దర్శనమిచ్చారు. ఇక్కడ పని చేస్తున్న మహిళా ఉపాధ్యాయురాలు సెలవుపై వెళ్లినట్లు సమాచారం. అయితే మండల విద్యాశాఖ అధికారులు ప్రత్యామ్నాయంగా మరో టీచర్‌ను ఏర్పాటు చేయాలి. అలా కాకపోవడంతో జమ్మక్కపల్లె పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్నం దాకా టీచర్ లేక పిల్లలే ఒకరినొకరు పాఠాలు చెప్పుకోవడం..ఆట్లాడుకోవడం దృశ్యాలు కనిపించాయి. మధ్యాహ్నం తరువాత ఓ సీఆర్‌పీ పాఠశాలకు హాజరయ్యాడు. అప్పటికే విద్యాశాఖ తీరుపట్ల గ్రామస్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇలా అయితే ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను చదువు కోసం పంపినా ఫలితం ఉండదంటున్నారు.

అపార్ అప్డేట్ వంద శాతం పూర్తి చేయాలి

తంబళ్లపల్లె, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల పూర్తి సమాచారం సేకరణలో భాగంగా చేపట్టిన ఆపార్ అప్డేట్ ప్రక్రియ వంద శాతం పూర్తి చేయాలని డీఎల్‌డీవో అమర్‌నాథ్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం డీఎల్‌డీవో తంబళ్లపల్లె, కన్నెమడుగు సచివాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఆధార్ సేవలపై ఆరాతీశారు. అనంతరం డీఎల్‌డీవో మాట్లాడుతూ..హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ సర్వే త్వరగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్‌పీసీఐ లింక్ కాని లబ్ధిదారులకు వెంటనే లింకు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో ధామస్ రాజు, ఈవోఆర్డీ దిలీప్‌కుమార్ నాయక్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేగంగా టీడీపీ సభ్యత్వ నమోదు

పెద్దమండ్యం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) పెద్దమండ్యం మండలంలో టీడీపీ సభ్యత్వం నమోదు వేగం పుంజుకుంది. శుక్రవారం టీడీపీ నేతలు నారా గంగాధర, మహేశ్వర, చలపతి, ఫారుక్ అహ్మద్, సిద్దవరం ప్రాంతంలో మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సిద్దవరం ప్రసాద్, బావాజీ, వెలిగల్లు పరిధిలో రామాంజులునాయుడు, రామాంజులు, సోంబ, బండమీదపల్లి గ్రామ పరిధిలో టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు విశ్వనాధరెడ్డి, కాలేషా తదితర నేతలు పార్టీ సభ్యత్వాలు చేశారు. హసీంసాబ్, పవన్‌కుమార్, మల్లికార్జున, చలపతినాయుడు, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

రేపు బ్రాహ్మణుల కార్తీకమాస వనభోజనం

మదనపల్లె అర్బన్, నవంబరు22(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణానికి చెందిన బ్రాహ్మణుల కార్తీకమాసం వనభోజన కార్యక్రమం ఈ నెల 24న నిర్వహిస్తున్నట్లు శంకర బ్రాహ్మణ సేవా సహకార సమితిఅధ్యక్షుడు గౌరవాధ్యక్షుడు కామకోటప్రసాదరావు, అధ్యక్షుడు కోదండరామయ్య తెలిపారు. నిమ్మనపల్లె రోడ్డులోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వద్ద బ్రాహ్మణ వనభోజన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

25న మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి కలికిరి రాక

కలికిరి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఏపీ చివరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి ఈ నెల 25న కలికిరి రానున్నారని ఆయన వ్యక్తిగత కార్యదర్శి ఎం. కృష్ణప్ప తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 2.34 గంటలకు బెంగుళూరు విమానాశ్రయం చేరుకుని అక్కడి నుంచి రోడ్డు మార్గాన 5.45 గంటలకు కలికిరి చేరుకుంటారన్నారు. ఆ మరునటి రోజు నుంచి మాజీ సీఎం పాల్గొనే కార్యక్రమాలను తరువాత ప్రకటించనున్నారు.

ఇంటిపన్నుల ఆన్‌లైన్‌ను వేగవంతం చేయండి



బూర్లపల్లె సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డివిజినల్ పంచాయతీ అధికారి

పెద్దతిప్పసముద్రం నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా పంచాయతీల్లో ఇంటిపన్నులకు సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలని డివిజినల్ పంచాయతీ అధికారి కె. నాగరాజు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలోని బూర్లపల్లె, మల్లెల, సంపతికోట, పీటీఎం సచివాలయాలను పరిశీలించి ఆయా పంచాయతీలకు సంబంధించిన ఇంటిపన్నుల డిజిటలైజేషన్ (ఆన్‌లైన్ ప్రక్రియ)ను వేగవంతం చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆయా సచివాలయాల్లో పర్యటించి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి సచివాలయ ఉద్యోగులు విధులకు హాజరు కాకపోతే అలాంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం నిర్దేశించిన పలు రకాల సర్వేలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఆధార్ కేంద్రాల్లో విద్యార్థులకు సకాలంలో ఆధార్ నమోదును చేసి వారికి ఎటువంటి ఇబ్బందులు కలిగించకుండా చూడాలన్నారు. వీలైతే ఆధార్ క్యాంపులను ఆయా పాఠశాలల్లో కేటాయించి విద్యార్థులకు ఆధార్ ధ్రువీకరణను వేగవంతం చేయాలన్నారు. ఆయన వెంట కందుకూరు పంచాయతీ కార్యదర్శి మనోహర్‌తో పాటు ఆయా పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

షాదీమహల్‌కు నిధులు మంజూరు చేయండి

- మంత్రి ఫరూక్‌కు మైనార్టీ నేత ఎస్ఏ మస్తాన్‌వినతి



మంత్రి ఫరూక్‌ను కలిసిన మైనార్టీ నేత ఎస్.ఎ.మస్తాన్

మదనపల్లె, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో కొన్నేళ్లుగా అసంపూర్తిగా ఉన్న షాదీమహల్ నిర్మాణాన్ని పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయాలని స్థానిక టీడీపీ మైనార్టీనేత ఎస్ఏమస్తాన్, మైనార్టీ, న్యాయశాఖ మంత్రి ఎన్.ఎం.డీ.ఫరూక్‌ను కోరారు. విజయవాడలోని అసెంబ్లీ హాలులో శుక్రవారం మంత్రిని కలసిన మస్తాన్ పెండింగ్ పనుల గురించి వివరించారు. ముస్లింమైనార్టీలకు మొదటిసారిగా గతంలో టీడీపీ ప్రభుత్వం షాదీమహల్ మంజూరు చేసింది, నిర్మాణానికి సరిపడా నిధులు లేకపోవడంతో ఏళ్ల తరబడి పనులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. మైనార్టీల అభివృద్ధి, సంక్షేమంగా చెప్పుకునే గత వైసీపీ ప్రభుత్వం అయిదేళ్లలో ఆ వర్గానికి చేసిందేమీ లేదని మస్తాన్, మంత్రి, దృష్టికి తీసుకెళ్లారు. అలాగే గత ప్రభుత్వంలో మౌజన్, ఇమామ్‌లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ మస్తాన్, మంత్రికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును అసెంబ్లీ హాలులో మర్యాదపూర్వకంగా కలిశారు.

మద్దయ్యగారిపల్లెలో చెత్తదిబ్బలు తొలగింపు



మద్దయ్యగారిపల్లెలో చెత్తదిబ్బలను తొలగిస్తున్న పంచాయతీ అధికారులు

పెద్దతిప్పసముద్రం నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్దయ్య గారిపల్లె పంచాయతీలోని ప్రధాన రహదారి పక్కనే ఉన్న చెత్తదిబ్బలను గ్రామ పంచాయతీ అధికారులు తొలగించారు. మండలంలోని మద్దయ్యగారిపల్లె పంచాయతీలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న చెత్తదిబ్బలపై 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'చెత్త నుంచి సంపద ఏదీ..', నిరుపయోగంగా డంపింగ్‌యార్డులు, ఆరుబయటే చెత్తదిబ్బలు, దుర్గంధంతో గ్రామీణుల పాట్లు అన్న శీర్షికన శుక్రవారం కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన పంచాయతీ అధికారులు యుద్ధప్రాతిపదికన ఎక్స్‌కవేటర్‌తో డంపింగ్ యార్డు పక్కన ఉన్న చెత్త దిబ్బలను తొలగించారు. ఇంకా గ్రామంలో ఉన్న చెత్త దిబ్బలను తొలగించేందుకు పంచాయతీ కార్మికులను పంపి పనులను వేగవంతం చేశారు. దీంతో మద్దయ్యగారిపల్లె గ్రామస్థులు ఆంధ్రజ్యోతికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్‌కు అభినందనలు



విజయ్‌కుమార్‌ను అభినందిస్తున్న టీడీపీ నేత ప్రశాంత్

మదనపల్లె టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాళెం విజయకుమార్‌కు మదనపల్లె టీడీపీ సీనియర్ నేత కేహెచ్ ప్రశాంత్ అభినందనలు తెలిపారు. శుక్రవారం అమరావతిలో బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నీలాయపాళెం విజయకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలసిన కేహెచ్ ప్రశాంత్ మాట్లాడుతూ క్రమశిక్షణగల టీడీపీలో కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందనేందుకు నిదర్శనమే విజయకుమార్‌కు రాష్ట్రస్థాయి పదవి వచ్చిందన్నారు. రాష్ట్రంలో జీవవైవిధ్యం సమతుల్యత కాపాడేందుకు విజయ్‌కుమార్ కృషి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆనం వెంకటరమణారెడ్డి, గడ్డం సతీష్, చాగంటి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర ఆదాయంపై రైతులకు అవగాహన కల్పించాలి



శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ అశోక్ కుమార్ రెడ్డి

పీలేరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సమగ్ర యాజమాన్య పద్ధతులు, సుస్థిర ఆదాయ వనరులపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీ అశోక్ కుమార్ రెడ్డి పీలేరు, కేవీపల్లె మండలాల్లోని రైతు సేవా కేంద్రాల సిబ్బందికి సూచించారు. పీలేరు మండలం దొడ్డిపల్లె పంచాయతీ రైతు సేవా కేంద్రంలో శుక్రవారం పీలేరు, కేవీపల్లె మండలాల్లోని రైతు సేవా కేంద్రాల సిబ్బందికి ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా సీజన్‌లలో వివిధ పంటల్లో పాటించాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. ప్రస్తుత రబీ సీజన్‌లో వేరుశనగ ఎకరాకు రూ.96లు, వరికి ఎకరాకు రూ.126లు ప్రీమియం చెల్లించి పంట బీమా చేయించుకోవాలన్నారు. కలికిరి కేవీకే శాస్త్రవేత్త పీరూ సాహెబ్ మాట్లడుతూ ప్రస్తుతం అలసంద టీపీటీసీ-29 రకాన్ని సాగు చేసి లాభం పొందవచ్చని రైతులకు తెలియజేయాలన్నారు. రబీలో వేసే వరిలో కాండం తొలుచు పురుగు, ఆకు ముడత పురుగు, దోమ నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కందిలో వెర్రి తెగులు, మారుకా మచ్చల పురుగు, శనగపచ్చ పురుగు, కంది ఈగ నివారణ చర్యలు తెలియజేశారు. కార్యక్రమంలో పీలేరు ఏడీ రమణరావు, పీలేరు, కేవీపల్లె ఏవోలు రమాదేవి శ్రావణి, కరుణాకర్ రెడ్డి, ఏఈవోలు ఇంద్ర, నజీర్, తదితరులు పాల్గొన్నారు.